


ముగ్గురాయి ఖాళీ..!

- రెండేళ్లలో తరిగిపోనున్న నిల్వలు
- మూతపడనున్న మంగంపేట గనులు
- ఉపాధి కోల్పోనున్న కార్మికులు, ఉద్యోగులు

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మంగంపేట ముగ్గురాయి గనులు రెండేళ్లకు ఖాళీ కానున్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమంది ఉపాధి కోల్పోనున్నారు. రెండేళ్లకు గనులు ఖాళీ అవుతాయని తెలియడంతో గ్రామస్థులు, కార్మికులు, ముగ్గురాయి ఎక్స్‌పోర్టర్స్, పల్వరైజింగ్ మిల్లుల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైల్వేకోడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె మండలంలోని మంగంపేటలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బెరైటీస్ నిక్షేపాలు ఉన్నాయి. 1958లో ఎంఎస్ సలార్‌ఉద్దీన్ అనే వ్యక్తి మంగంపేటలో లభించే ముగ్గురాయిని తమిళనాడుకు తీసుకెళ్లి పరీక్షలు చేయించడంతో వీటిలో బేరియం కెమికల్స్ ఉన్నాయని తేలింది. అనంతరం రెండు నుంచి మూడేళ్ల పాటు మంగంపేట ముగ్గురాయిపై జియలాజికల్ సర్వే చేశారు. మంగంపేటలో 74 మిలియన్ల టన్నుల బెరైటీస్ ఉందని నిర్ధారించారు. 1962-63 మధ్య కాలంలో వైఎస్ రాజారెడ్డి, కందుల ఓబుల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సీఎం రామనాథరెడ్డి, టిఫిన్ కంపెనీ అధినేత రాజగోపాల్, మంగంపేట కాపుపల్లెకు చెందిన గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎంఎస్ సత్తార్‌మియా తదితర ప్రైవేటు వ్యక్తులు మంగంపేటను సందర్శించి మళ్లీ ఇతర రాష్ట్రాల్లో పరీక్షలు చేయించారు. బెరైటీస్ నిక్షేపాలు ఖరీదైనవి ఉన్నాయని నిర్ధారించుకున్నారు. 1964లో మంగంపేటలో సుమారు 5 ఎకరాల భూములను కొనుగోలు చేసి మైనింగ్ లీజుకు తీసుకుని ముగ్గురాయి ఎగుమతులు ప్రారంభించారు. 1970-71లో మంగంపేటలో ఏపీఎండీసీ (ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ)ను ఏర్పాటు చేశారు. మొదట సుమారు 4 ఎకరాల్లో ఏపీఎండీసీ మైనింగ్ ప్రారంభించింది. 1974లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు చెందిన గనుల లీజులను రద్దు చేసి స్వాధీనం చేసుకుంది.


మంగంపేట బెరైటీస్ గనులు



ఏ-గ్రేడు ముగ్గురాయి



బీ-గ్రేడు ముగ్గురాయి



సీ/డీ గ్రేడు ముగ్గురాయి

విదేశాలకు ఎగుమతులు

గనుల్లో ఉన్న ముగ్గురాయిని బేరియం కెమికల్స్ సాంద్రతను బట్టి ఏ-బీ-సీ/డీ గ్రేడ్లు గా విభజించారు. ప్రస్తుతం ఏ-గ్రేడు బెరైటీస్ రాయి 80 వేల టన్నులు, బీ-గ్రేడు రాయి 3,35,000, సీ/డీ గ్రేడ్ల రాయి 82 లక్షల టన్నులు వెలికి తీసినవి ఉన్నాయి. ప్రస్తుతం ముగ్గురాయి గనుల్లో ఏ-గ్రేడు 45 లక్షల టన్నులు, బీ-గ్రేడు 10 లక్షల టన్నులు, సీ/డీ గ్రేడ్లు 45 లక్షల టన్నులు ఉన్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇక్కడ లభించే ముగ్గురాయిలో బేరియం కెమికల్స్ ఎక్కువగా ఉండటంతో పౌడర్‌ను చైనా, అమెరికా, యూరోపియన్, గల్ఫ్ దేశాల్లో ఉన్న పెట్రోలియం బావుల్లో ఘర్షణ వాతావరణాన్ని నివారించేందుకు ఉపయోగిస్తున్నారు. దీంతో మంగంపేట ముగ్గురాయికి డిమాండ్ ఉంది. 1975-76 మధ్య కాలంలో ఓఎన్‌జీసీ (ఆయిల్ న్యాచురల్ గ్యాస్ సంస్థ) ద్వారా పెట్రోల్ బావులకు మంగంపేట బెరైటీస్ పౌడర్‌ను ఎగుమతులు చేశారు.

ముగ్గురాయి ధరలు టన్ను రూ.లలో		
రకం	తొలిరోజుల్లో	ఇప్పుడు
ఏ-గ్రేడు	170	7,200
బీ-గ్రేడు	160	5,600
సీ/డీ గ్రేడ్లు	140	1780

పల్వరైజింగ్ మిల్లుల గతేంటి..?

ముగ్గురాయి గనులపై 160 పల్వరైజింగ్ మిల్లులు ఆధారపడి ఉన్నాయి. ముగ్గురాయి ముడి సరుకును పల్వరైజింగ్ మిల్లులకు ఇస్తారు. పల్వరైజింగ్ మిల్లులలో పౌడర్ చేసి డిమాండ్ ఉన్న దేశాలకు ఎగుమతులు చేస్తారు. మంగంపేట ముగ్గురాయి గనుల్లో రెండేళ్లకు [illegible] లేకుండా పోతుందన్న విషయం తెలియగానే మిల్లుల యజమానుల్లో ఆందోళన మొదలైంది.

వైసీపీ నిర్వాకంతో పదేళ్ల ముందే ఖాళీ

రెండేళ్లలో ముగ్గురాయిని వెలికితీసి అమ్ముకుని మూసేస్తారని అధికారులు చెబుతున్నారు. దీంతో ఏపీఎండీసీలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. 81 మంది ఏపీఎండీసీలో పర్మినెంట్ ఉద్యోగులు, 511 మంది ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్నారు. మంగంపేటలో పల్వరైజింగ్ మిల్లులతో వేలాది మంది కార్మికులు ఆధారపడి పనిచేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో 15 ఏళ్లకు సరిపడ ఉన్న ముగ్గురాయిని ఐదేళ్లలో వెలికితీశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గనుల్లో రాయి లేకుండా ఖాళీ అయితే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మంగంపేట పరిస్థితి ఏంటని గ్రామస్థులు, కార్మికులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు తదితరులు ఆందోళన చెందుతున్నారు.


మంగంపేటలో వెలసి ఉన్న పల్వరైజింగ్ మిల్లులు

ఒకటిన్నర ఏడాదికే రాయి ఖాళీ



మంగంపేట బెరైటీస్ గనుల్లో రెండేళ్లకు కాదు.. ఒకటిన్నర ఏడాదికే రాయి ఖాళీ అవుతుంది. ఈ విషయం తవ్వకాల్లో బయటపడింది. ఈ మేరకు యాజమాన్యానికి సమాచారం ఇచ్చాము. గనుల్లో ఉన్న రాయిని ప్రతిరోజూ వెలికితీసి డంప్ చేస్తున్నాము. ఉన్న రాయిని అమ్ముకోవడం తప్ప మరేమి చేయలేము. ఉద్యోగులు, కార్మికుల గురించి యాజమాన్యం ఆలోచిస్తుంది.

- కె.గోపీనాథ్, ఏపీఎండీసీ, మంగంపేట సీపీవో

ముగ్గురాయిని పల్వరైజింగ్ మిల్లులకు ఇవ్వండి



రాష్ట్ర, దేశ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముడి ఖనిజం ఎగుమతిని నియంత్రించేలా యాజమాన్యం నిర్ణయం తీసుకోవాలి. అలాగే పల్వరైజింగ్ మిల్లులకు సరిపడా ముడి ఖనిజాన్ని సరఫరా చేయాలి. మంగంపేట ముగ్గురాయి ఖాళీ అయిపోతుందంటే వేలాది మంది కార్మికులు రోడ్డున పడతారు.

- మాచినేని విశ్వేశ్వరనాయుడు, ముగ్గురాయి మిల్లుల అసోసియేషన్ అధ్యక్షుడు, రైల్వేకోడూరు

నమ్మశక్యం కావడం లేదు



మంగంపేట బెరైటీస్ ఖాళీ అవుతుందంటే నమ్మశక్యంగా లేదు. కొన్ని వేల మెట్రిక్ టన్నుల ముగ్గురాయి నిక్షేపాలు గనుల్లో ఉన్నాయి. అధికారుల అనుమతితో గనులను కార్మిక సంఘాలతో కలసి పరిశీలిస్తాము. గనుల్లో రాయి ఖాళీ అయితే మాత్రం వేలాది కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతాయి.

- తుమ్మల రాధాక్రిష్ణయ్య,మంగంపేట ఏపీఎండీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు

గిట్టుబాటు ధరలపై మాటల యుద్ధం

- గరంగరంగా జడ్పీ సమావేశం



జడ్పీ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, అన్నమయ్య జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

కడప రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం గరంగరంగా కొనసాగింది. పంటలకు గిట్టుబాటు ధరలపై వైసీపీ, కూటమి నేతల మధ్య మాటల యుద్ధం జరిగింది. జడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి అధ్యక్షతన సమావేశం ప్రారంభమైంది. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం సభ ప్రారంభమైన కొద్దిసేపటికి గిట్టుబాటు ధరలపై టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య రభస చోటు చేసుకుంది. ఉల్లి, చీనీ, మామిడి, అరటి తదితర పంటల ధరపై దుమారం రేగింది. వైసీపీ ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, ఎంపీపీలు, జడ్పీటీసీలు వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తావనను పదేపదే తీసుకువచ్చారు. దీంతో టీడీపీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాష్‌లు ఎదురు దాడికి దిగారు. రైతుల గురించి మీరా మాట్లాడేది... మీ ప్రభుత్వంలో వ్యవసాయరంగాన్ని సర్వనాశనం చేశారు... సీఎం చంద్రబాబు నిత్యం రైతులతో మమేకమై వారి కష్ట, నష్టాలను తెలుసుకొని బాసటగా నిలుస్తున్నారని తెలిపారు. సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలను కడప జిల్లాలోనే కొనసాగించాలని, లేకుంటే రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని ఒంటిమిట్ట జడ్పీటీసీ సభ్యుడు ముద్దుకృష్ణారెడ్డి తెలిపారు. పుల్లంపేట మండలంలో 400 ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని, ఒకే వ్యక్తి 40 ఎకరాలు ఆక్రమిస్తే తహశీల్దార్ ఎలాంటి చర్యలను తీసుకోలేదని ఎంపీపీ బాబుల్‌రెడ్డి ఆరోపించారు. సమావేశంలో కడప కలెక్టర్ శ్రీధర్, ప్రభుత్వ విప్, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వెలిగల్లు నుంచి రూ.350 కోట్లతో తాగునీరు

- రూ.30 కోట్లతో కాలువల ఆధునికీకరణకు ప్రతిపాదనలు
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


వెలిగల్లు ప్రాజెక్టులో చేపపిల్లలను వదులుతున్న మంత్రి, తదితరులు

గాలివీడు డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వెలిగల్లు ప్రాజెక్టు నుంచి 350 కోట్ల రూపాయలతో నియోజకవర్గానికి తాగునీరు అందిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం వెలిగల్లు ప్రాజెక్టులో 4.80 లక్షల చేప పిల్లలను వదిలారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకుని అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. ప్రతి రైతు పంట మార్పిడి చేయాలని, సాగుకు ముందు భూసార పరీక్షలు తప్పకుండా చేయించాలన్నారు. వెలిగల్లు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణకు రూ.30 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. రాబోయే 16 నెలల్లో జల్‌జీవన్ పథకం ద్వారా అన్ని గ్రామాలకు తాగునీరు అందిస్తామన్నారు. అంతేకాకుండా గాలివీడు మండలానికి ఏపీ మోడల్ స్కూల్ మంజూరు చేయిస్తామన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇంటి స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణాలు చేపతామన్నారు. భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటారని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారులు సుస్మిత, సుబ్బయ్య, నరసయ్య, రామాంజనేయులు, ఎంపీడీవో, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీకగా అయ్యప్ప గ్రామోత్సవం

- హిందూ-ముస్లింల ఐక్యత చరిత్రలో నిలిచిపోతుంది
- మీడియా సమావేశంలో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటి టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో శుక్రవారం రాత్రి జరిగిన అయ్యప్ప స్వాముల గ్రామోత్సవం మత సామరస్యానికి ప్రతీకగా చరిత్రలో నిలిచిపోయే రీతిలో ఎక్కడా చిన్న అవాంఛనీయ సంఘటనకు కూడా తావు లేకుండా, ఆదర్శంతమైన శాంతియుత వాతావరణంలో జరిగిందని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అయ్యప్ప స్వామి ఆధ్యాత్మిక శోభాయాత్రలో దాదాపు 1500 నుంచి 2000 మంది అయ్యప్ప స్వాములతో పాటు 3200 మందికి పైగా భక్తులు పాల్గొన్నారన్నారు. పట్టణమంతా భక్తిభావంతో పులకించిపోయిందన్నారు. గత అనుభవాల దృష్ట్యా ఈ గ్రామోత్సవాన్ని ఒక సవాలుగా స్వీకరించి అత్యంత ప్రతిష్టాత్మకంగా భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. అదనపు ఎస్పీ, రాయచోటి, మదనపల్లె డీఎస్పీల పర్యవేక్షణలో 13 మంది సీఐలు, 28 మంది ఎస్ఐలు, స్పెషల్ పార్టీలు, 340 మందికిపైగా పోలీసు యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా పనిచేసిందన్నారు. భక్తుల భద్రతను, ట్రాఫిక్ నియంత్రణను పర్యవేక్షించడానికి డ్రోన్ కెమెరాలను వినియోగిస్తూ, రెవెన్యూ యంత్రాంగం, అధికారుల సహకారం, సమన్వయంతో సమర్థవంతంగా కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. గ్రామోత్సవంలో హిందూ-ముస్లింల మధ్య వెలివిరిసిన అద్భుతమైన ఐక్యతతో పాటు ఊరేగింపు మార్గంలో ముస్లింలు స్వచ్ఛందంగా స్వాగత వేదికలను ఏర్పాటు చేశారన్నారు. వారు అయ్యప్ప స్వాములకు మంచినీరు, పండ్ల రసాలు(జ్యూస్), అరటి పండ్లను పంపిణీ చేసి తమ గౌరవాన్ని చాటుకున్నారన్నారు. ఇరువర్గాల మత పెద్దలు, యువకులు పరస్పరం గౌరవించుకుంటూ మత సామరస్యాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చూపించి రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ చారిత్రక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పగలు రాత్రి అనకుండా అంకితభావంతో పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రశంసించారు. ప్రశాంత వాతావరణాన్ని కాపాడి, ఐక్యతా భావాన్ని ప్రదర్శించిన రాయచోటి ప్రజలు, అయ్యప్ప స్వాములు, ముస్లిం మత పెద్దలు, యువకులు, భక్తులందరికీ ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హైకోర్టు జడ్జి


హైకోర్టు జడ్జిని సత్కరిస్తున్న ఆలయ ధర్మకర్తలు

రాజంపేట టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భువనగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని హైకోర్టు జడ్జి కె.శ్రీనివాసరెడ్డి శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతించారు. పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ మర్యాదలతో సత్కరించారు. కార్యక్రమంలో మూడవ అదనపు జిల్లా న్యాయాధికారి ప్రవీణ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంతు నాయుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని, సబ్‌కలెక్టర్ భావన, సీనియర్ సివిల్ జడ్జి కేశవ, జూనియర్ సివిల్ జడ్జి రాజన్ ఉదయ్ ప్రకాశ్, తహసీల్దారు పీర్‌మున్నీ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె ఫైల్స్ కేసులో..
మాధవరెడ్డి కోసం సీఐడీ ఆరా


మాధవరెడ్డి ఇంటి నుంచి బయటకు వస్తున్న సీఐడీ, పోలీసులు

మదనపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఫైల్స్ కేసులో ప్రధాన నిందితుడు వి.మాధవరెడ్డి కోసం పోలీసులు అన్వేషణ మొదలు పెట్టారు. భూఆక్రమణ, అక్రమాలు, కీలకమైన రెవెన్యూ ఫైల్స్ దహనం కేసులో మాధవరెడ్డి ఏ-3గా ఉన్నారు. 2024 జూలై 23 జరిగిన ఈ సంఘటనలో సబ్‌కలెక్టర్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్‌నాయుడు, పూర్వపు ఆర్డీవోలు ఎం.ఎస్.మురళి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి పీఏ మునితుకారాం, తదితరులు ఉన్నారు. ఇందులో ఏ-3గా ఉన్న మాధవరెడ్డి బెయిల్‌పై బయటకు రాగా సీఐడీ పోలీసులు హైకోర్టులో పిటీషన్ దాఖలు చేయగా బెయిల్ రద్దయినట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో మదనపల్లెలో ఉంటున్నారనే సమాచారం మేరకు సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్, స్థానిక వన్‌టౌన్ పోలీసులతో కలసి రెడ్డీస్ కాలనీలోని మాధవరెడ్డి నివాసానికి చేరుకున్నారు. శనివారం తెల్లవారు జాము నుంచి ఆయన కోసం వేచి చూసిన సీఐడీకి నిరాశే ఎదురైంది. మాధవరెడ్డితో సహా కుటుంబీకులు ఎవరూ ఇంట్లో లేకపోవడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు. ఇక్కడి నుంచి రొంపిచెర్లలోని కల్యాణమండపం, పులిచెర్ల మండలంలోని మాధవరెడ్డి నివాసం, ఎస్టేట్‌పై కూడా ఆరా తీశారు. అక్కడ కూడా మాధవరెడ్డి ఆచూకీ దొరక్కపోవడంతో అక్కడికి వెళ్లకుండానే తిరుపతికి వెళ్లిపోయినట్లు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఇదే కేసులో ఏ-1, సబ్‌కలెక్టర్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్ బెయిల్‌పై రాగా, ఏ-2 పూర్వపు ఆర్డీవో ఎం.ఎస్.మురళి ఇదివరకే సుప్రీంకోర్టు నుంచి బెయిల్ తెచ్చుకోగా సీఐడీ పోలీసులు అప్పీల్‌కు వెళ్లగా, సుప్రీంకోర్టు బెయిల్ రద్దు చేసింది. అప్పటి నుంచి మురళి రిమాండ్‌లో ఉన్నారు. అలాగే పెద్దిరెడ్డి పీఏ మునితుకారం విదేశాల నుంచి ఇండియాకు వచ్చినట్లు సీఐడీ దృష్టికి రావడంతో ఆయన కోసం సీఐడీ పోలీసులు బృందాలుగా ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో గాలిస్తున్నట్లు తెలిసింది.

బీటీ కళాశాలే కలెక్టరేట్..!

- ఎస్పీ కార్యాలయం జీఆర్‌టీ స్కూల్
- నిర్ణయించిన కలెక్టర్ నిశాంత్‌కుమార్
- స్కెచ్‌ల తయారీలో సర్వే శాఖ


బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భవనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, సబ్ కలెక్టర్ కళ్యాణి

మదనపల్లె/టౌన్ డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ప్రకటన నేపథ్యంలో అధికార యంత్రాంగం అందుకు తగిన ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రధానంగా కలెక్టర్ నిశాంత్‌కుమార్, స్థానిక సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణితో కలసి శనివారం పట్టణంలోని ప్రధాన ప్రాంతాలు, భవనాలను పరిశీలించారు. ముఖ్యంగా బీటీ కళాశాల, పక్కనే ఉన్న జీఆర్‌టీ స్కూల్‌తో పాటు వాటి మైదానాలను చూశారు. అనంతరం మిషన్ కాంపౌండు, నిమ్మనపల్లె రోడ్డులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలించారు. వీటిలో చివరగా బీటీ కళాశాలను కలెక్టరేట్‌గా, దానికి ఆనుకునే ఉన్న జీఆర్‌టీ స్కూల్‌ను ఎస్పీ కార్యాలయాలకు కేటాయించాలని నిర్ణయించారు. మరోవైపు జీఆర్‌టీ స్కూల్ వెనుక వైపు ఉన్న గ్రౌండ్‌ను పోలీస్ పెరేడ్ మైదానానికి, బెంగళూరు రోడ్డు, నక్కలదిన్నె సమీపంలోని బీటీ కళాశాల మైదానాన్ని కలెక్టర్ పెరేడ్‌కు వినియోగించాలనే నిర్ణయానికి వచ్చారు. అలాగే ప్రస్తుత సబ్‌కలెక్టర్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న మిషన్ కాంపౌండ్‌ను పార్కింగ్‌కు వినియోగించాలని, జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలోని కొన్ని భవనాలను ఇతర కార్యాలయాలకు వినియోగించుకోవచ్చన్న అధికారుల సూచనను కలెక్టర్ ప్రస్తుతానికి వద్దులే అంటూ తోసిపుచ్చారు. అలాగే బీటీ కళాశాలలోని లైబ్రరీ, రవీంద్రనాథ్ ఠాగూర్ భవనాన్ని అలాగే ఉంచాలని అధికారులకు సూచించారు. ఇందులో భాగంగా బెంగళూరు రోడ్డు వైపున బీటీ కళాశాలలో భాగమైన అప్పటి ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్‌లుగా వినియోగిస్తున్న గ్రౌండ్‌ఫ్లోర్‌తోపాటు మొదటి అంతస్థులు, అదే ఆవరణంలో లైబ్రరీకి కింది వైపున ఉన్న పీజీ తరగతి గదులు, హాస్టల్స్ గదులను గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు మొదటి అంతస్థు కలెక్టర్ కార్యాలయానికి ఉపయోగించనున్నారు. ఈ క్రమంలో కలెక్టర్ కార్యాలయంలోని 23 విభాగాలకు ఇక్కడ గదులు, సెక్షన్లు కేటాయించనున్నారు. ఇందుకు సంబంధించిన గదులు, హాల్స్ ఎన్ని ఉన్నాయో మ్యాపు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సర్వేఅధికారులు, సిబ్బంది స్వాధీనం చేసుకోనున్న గదుల కొలతలు తీసి స్కెచ్ సిద్ధం చేస్తున్నారు. ఎస్పీ కార్యాలయాన్ని కలెక్టరేట్‌కు దగ్గరగా బీటీ కళాశాలకు పక్కనే ఉన్న జీఆర్‌టీ స్కూల్‌ను ఎంపిక చేసినట్లు చెబుతున్నారు. అక్కడ గదులు అంత అనూకూలంగా లేవని, చాలా పాతబడినట్లు ఉన్నాయని పోలీస్ శాఖ చెప్పగా, మరో ఆప్షన్ లేదనే విధంగా కలెక్టర్ చెప్పినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన నిధులు ఇస్తామని, మరమ్మతులు చేసుకోవచ్చని సూచించినట్లు సమాచారం. సోమవారానికి సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో ఉండాల్సిన మొత్తం 63 విభాగాల కార్యాలయాలను ఈనెలాఖరులోగా గుర్తించే దిశగా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. మరోవైపు జనవరి మొదటికి జిల్లా అధికారికంగా ప్రకటించడం, వెంటనే కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం జనవరి 26వ తేదీ బెంగళూరు రోడ్డులోని బీటీ కళాశాల మైదానంలో రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించేలా అధికారులు ముందుకెళ్తున్నారు.

పీలేరులో కోర్టు భవనాల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్

- రూ.23.70 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు
- ఫలించిన నల్లారి సోదరుల కృషి

పీలేరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దశాబ్ద కాలంగా పీలేరు ప్రజలను ఊరిస్తున్న కోర్టు నూతన భవనాల నిర్మాణాల కోసం కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పీలేరులో నాలుగు కోర్టుల సముదాయాలు నిర్మించేందుకు రూ.23.70 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు ఈనెల 4వ తేదీ (గురువారం) రాష్ట్ర న్యాయ, శాసన వ్యవహారాలశాఖ కార్యదర్శి గొట్టపు ప్రతిభాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇంతకాలంగా అనిశ్చితిలో ఉన్న నూతన భవనాల నిర్మాణం వేగవంతం కానుంది.

2013లో మంజూరు, ఆపై అడ్డంకులు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పీలేరు, కేవీ పల్లె, కలకడ, గుర్రంకొండ, వాల్మీకిపురం, కలికిరి, రొంపిచెర్ల, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, సదుం మండలాలు పీలేరు కోర్టుల పరిధిలోకి వస్తాయి. పీలేరులో ప్రస్తుతం 11వ అదనపు జిల్లా జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులు ఉన్నాయి. వీటిలో 11వ అదనపు జిల్లా జడ్జి న్యాయస్థానాన్ని నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంజూరు చేశారు.

సాధారణంగా మునిసిపల్ ప్రాంతాలకు మాత్రమే మంజూరు చేసే జిల్లా కోర్టును ఆయన స్వయంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో మాట్లాడి పంచాయతీ కేంద్రమైన పీలేరులో ఏర్పాటు చేయించారు. ఆ సమయంలోనే పీలేరు కోర్టులకు నూతన భవనాలు నిర్మించాలన్న ప్రతిపాదన ముందుకు రాగా ఆయన స్థల సేకరణ, నూతన భవనాల నిర్మాణానికి అంగీకరించి అందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఆయన చొరవతో మదనపల్లె మార్గంలోని ఈద్గా మైదానానికి ఆనుకుని ఉన్న చెన్నకేశవ స్వామి ఆలయ మాన్య భూములకు పరిహారం చెల్లించి కోర్టుల సముదాయం నిర్మించాలని నిర్ణయించారు. అయితే ఆయన పదవీ కాలంలో పరిహారం విడుదల ఆలస్యం కావడంతో ఆ పనులకు తాత్కాలికంగా బ్రేకులు పడ్డాయి. ఆ తరువాత వచ్చిన టీడీపీ ప్రభుత్వంలో స్థానిక న్యాయవాదుల కృషి ఫలితంగా ఆలయ భూములకు రూ.3 కోట్ల మేర రెండు విడతలుగా పరిహారం మంజూరైంది కానీ నూతన భవనాల కోసం నిధులు మంజూరు కాకపోవడంతో భవనాల నిర్మాణంపై అనిశ్చితి నెలకొంది.





పీలేరులో ప్రస్తుతం ఉన్న కోర్టు భవనం, కొత్త భవనాలు నిర్మించనున్న చెన్నకేశవ స్వామి ఆలయ భూములు

ఎమ్మెల్యే, బార్ అసోసియేషన్ కృషితో కదలిక

2024 ఎన్నికల సమయంలో స్థానిక న్యాయవాదులు నూతన భవనాల అంశం నల్లారి కిశోర్ కుమార్ రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. తమ ప్రభుత్వం కొలువు దీరిన వెంటనే అందుకు సంబంధించిన చర్యలు చేపడతామని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఆ మేరకు కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బీసీ పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్ తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వారికి ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సహకారం లభించి నూతన భవనాల అంశం ప్రభుత్వ పెద్దలు దృష్టికి తీసుకెళ్లారు. వారి కృషి ఫలించి ప్రభుత్వం పీలేరులో నాలుగు కోర్టుల సముదాయాల నిర్మాణానికి రూ.23.70 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఈ సందర్భంగా శనివారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కోర్టుల సముదాయం కోసం రూ.31 కోట్లు అవసరమని ఆర్అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపారని, తొలి విడతగా ప్రభుత్వం రూ.23.70 కోట్లకు అంగీకరించిందని, మిగిలిన నిధులను కూడా సాధిస్తామన్నారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ నిధుల మంజూరు ఇక కేవలం లాంఛనమేనని, త్వరలోనే నిర్మాణ పనులు కార్యరూపం దాల్చుతాయని తెలిపారు. కోర్టుల భవనాలకు నిధుల మంజూరు నేపథ్యంలో కూటమి ప్రభుత్వంలో పీలేరుకు అంతా మంచే జరుగుతోందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. మొన్న పీలేరును గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మార్చేందుకు అంగీకారం, నిన్న రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటన, నేడు పీలేరులోని కోర్టులకు నూతన భవనాల నిర్మాణానికి నిధుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్‌తో ఇక పీలేరు అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పోలి చెరువు వద్ద చమర్తి జలహారతి



జలహారతి ఇస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటలో అతి పెద్దచెరువు పోలి చెరువు పూర్తిగా నిండడంతో టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్ మోహన్‌రాజు శనివారం జలహారతి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో ప్రస్తుత వర్షాల వల్ల అన్ని చెరువులు నిండడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు నాగేశ్వర్‌నాయుడు, మార్కెట్‌యార్డు ఛైర్మన్ గన్నే సుబ్బనరసయ్యనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రవికుమార్‌నాయుడు, పట్టణ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై మచ్చుకత్తితో దాడి



గాయపడిన గంగరాజు

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తన భార్యతో మాట్లాడుతున్నాడనే అనుమానంతో ఓ వ్యక్తి మచ్చుకత్తితో దాడి చేసి గాయపరిచాడని ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. ఆయన కథనం మేరకు గంగరాజు అనే వ్యక్తి ప్రతిరోజూ తన చెల్లెలి పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకొచ్చి వదిలేవాడు. శనివారం యథావిధిగా అక్కడికి వచ్చిన గంగరాజును అంగన్‌వాడీ కేంద్రం పక్కనే ఉన్న ఇంట్లో అద్దెకు నివసిస్తున్న సురేశ్ సెల్‌ఫోన్ ఇమ్మని అడిగాడు. అందుకు అతను తిరస్కరించడంతో ఇద్దరూ గొడవపడ్డారు. తన భార్యతో రోజూ మాట్లాడుతున్నావని ఆరోపిస్తూ మచ్చుకత్తితో సురేశ్ దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన గంగరాజును చుట్టుపక్కలవారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. సురేశ్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మద్యం దుకాణంలో చోరీ

కురబలకోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంగళ్లులో శుక్రవారం రాత్రి అంగళ్లులోని కదిరి రోడ్డులో మద్యం దుకాణంలో చోరీ జరిగింది. రూ.45 వేల నగదు, మద్యం బాటిళ్లను దొంగిలించుకెళ్లారు. షాపుపై ఉన్న రేకులను కట్ చేసి షాపులోకి ప్రవేశించి చోరీ చేశారు. శనివారం ఉదయం షాపులో చోరీకి గురైన విషయాన్ని దుకాణదారులు చూసి యజమానికి తెలియజేశారు. దీంతో దుకాణయజమాని రుద్ర బాలకృష్ణ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు విచారించారు. ఒక షాపులో చోరీకి పాల్పడిన సంఘటన సీసీ కెమెరాలో నమోదైంది. కాగా ఒక యువకుడు చోరీ చేసినట్లు తెలుస్తోంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య



కీర్తిరెడ్డి మృతదేహం

రాజంపేట టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ చదువుతున్న కనపర్తి కీర్తిరెడ్డి (21)అనే యువతి శనివారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మన్నూరు పోలీసులు అందించిన సమాచారం ప్రకారం... నందలూరు గ్రామానికి చెందిన కీర్తిరెడ్డి తండ్రి ఉపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లగా, ఆమె తల్లి అన్నమాచార్య యూనివర్సిటీకి సమీపంలోని బోయనపల్లెలో నివాసముంటూ కూతురిని చదివించుకుంటోంది. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం బెడ్ రూంలోకి వెళ్లిన కీర్తి రెడ్డి ఎంతసేపటికీ తలుపులు తెరవకపోవడంతో అనుమానించిన తల్లి తలుపులు తెరవగా కూతురు ఫ్యానుకు వేలాడుతూ కనిపించింది. స్థానికుల సాయంతో ఆమెను కిందకు దించి రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆమె మృతికి కారణాలు తెలియరాలేదని, కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పట్టపగలే వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

కలికిరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాయమాటలు చెబుతూ వృద్ధురాలు చదివే అరుణకుమారి మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కుపోయిన సంఘటన శనివారం కలికిరిలో జరిగింది. పట్టణంలోని చదివే వాండ్లపల్లెలో పీలేరు రోడ్డులో చదివే నరసింహారెడ్డి భార్య అరుణకుమారి ఒంటరిగా నివసిస్తోంది. పిల్లలు బయట ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి అరుణకుమారి ఇంటి వద్దకు వచ్చి ఇల్లు బాడుగకు ఇస్తావా అని అడిగాడు. అలా అడుగుతూనే ఇంటి లోపలికి దూసుకెళ్లి అరుణకుమారి మెడలోని బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. దొంగిలించిన గొలుసు బరువు 36 గ్రాములుగా పేర్కొంటూ ఈ మేరకు అరుణకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన సీఐ రామచంద్ర, ఎస్ఐ రమణ పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. అనుమానితుడి ఫొటోలు లభ్యమైనట్లు సమాచారం.

బస్సు నుంచి పడి మహిళకు గాయాలు



గాయపడ్డ భాగ్యమ్మ

ములకలచెరువు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు నుంచి పడి మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీసుల కథనం మేరకు... ములకలచెరువు వాసి భాగ్యమ్మ పనుల నిమిత్తం సత్యసాయి జిల్లా నల్లచెరువుకు వెళ్లేందుకు బస్టాండు సర్కిల్‌కు వచ్చింది. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సు రావడంతో ఎక్కుతుండగా డ్రైవర్ ముందుకు కదిలించాడు. దీంతో మహిళ కిందపడి తీవ్రంగా గాయపడింది. మహిళ కిందపడిపోయినా డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించి వెళ్లిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడే ఉన్న ఆటోడ్రైవర్లు మహిళను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో 108 అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సు ముందు మహిళల నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించే ప్రభుత్వం సరిహద్దు గ్రామాలకు పథకం వర్తింపజేయడం లేదని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. కొద్ది రోజులుగా మండలంలోని కర్ణాటక సరిహద్దు గ్రామాలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం నిలిపేయడంతో మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం బి.కొత్తకోట నుంచి చేలూరుకు వయా కందుకూరు, కమ్మచెరువు మీదుగా చేలూరుకు వెళ్లే పలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం నిలిపేశారని పలువురు కందుకూరు మహిళలు కందుకూరులో ఆర్టీసీ బస్సును నిలిపి నిరసన వ్యక్తం చేశారు. మహిళలు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం లేకపోవడంతో సరిహద్దు గ్రామాల్లో ఉన్న మాకు తీవ్ర నష్టం జరుగుతోందని, సంబంధిత అధికారులు స్పందించి సరిహద్దు గ్రామాలకు ఉచిత ప్రయాణాన్ని కొనసాగించి మాకు న్యాయం చేయాలని మహిళలు కోరుతున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి(నేతాజీ సర్కిల్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని వైద్య ఆరోగ్య శాఖకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో అందించే వైద్య సేవలు, ఐఎంఆర్, ఎంఎంఆర్ ప్రమాణాలు, వివిధ రకాల వైద్య పరీక్షలు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాలలో నిర్వహించే రక్త పరీక్షల్లో కొన్ని ఆరోగ్య కేంద్రాల్లో గర్భవతుల హిమోగ్లోబిన్ శాతం తక్కువగా నమోదు అవుతోందని, దీనిపై ఆరోగ్య అధికారులు దృష్టి సారించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలతో సమన్వయం చేసుకుని నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. కొన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఐఎంఆర్, ఎంఎంఆర్‌లు నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవడం లేదని, సంబంధిత ఆరోగ్య శాఖ అధికారులు, ఏఎన్ఎంలు దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఇటీవల జరిగిన మరణాలపై సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలు, గురుకులాలు, కస్తూరి బా పాఠశాలల్లో ఆరోగ్య శాఖ అధికారులు, ఏఎన్ఎంలు తరచుగా పరీక్షలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

- ఏడీఏ రమణారావు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ రమణారావు

బి.కొత్తకోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, క్రిమి సంహారక మందులను అధిక ధరలకు అమ్మినట్లు రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ పీలేరు ఏడీఏ రమణారావు దుకాణదారులను హెచ్చరించారు. సామాజిక తనిఖీల్లో భాగంగా శనివారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేపట్టిన ఆయన మాట్లాడుతూ నిషేధిత మందులు, ఎరువులు ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించరాదన్నారు.

ప్రతి దుకాణంలోనూ అమ్మకాలు, కొనుగోళ్లు, ప్రస్తుతం ఆయా దుకాణాల్లో ఎరువులు, క్రిమిసంహారక మందుల నిల్వల వివరాలు రికార్డులు, బోర్డుల్లో కనపరచాలని, విక్రయించిన మందులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. వ్యాపారులు మోసం చేస్తే ఆధారాలతో తమకు ఫిర్యాదు చేయాలని రైతులకు తెలిపారు. రైతన్నా..మీ కోసం ద్వారా రైతులు అవగాహన పొంది, ఆరుతడి పంటలు, ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని సూచించారు.

నిందితులపై కేసు నమోదు



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న లారీ డ్రైవర్స్ అసోసియేషన్ నేతలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్‌పై దాడి చేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు తమిళనాడు రాష్ట్రం గుడియాతానికి చెందిన లారీ డ్రైవర్ సయ్యద్ అంజాద్ ఝార్ఖండ్ నుంచి మదనపల్లె మార్కెట్ యార్డుకు సరుకు లోడును గురువారం రాత్రి తీసుకొచ్చారు. మదనపల్లెకు చెందిన పీఎం ట్రేడర్స్ మసూద్ కిరాయి ఇవ్వక పోవడంతో కిరాయి కోసం నిలదీశాడు. దీంతో మండి యాజమాని, మరో ఐదుగురు లారీ డ్రైవర్‌పై దాడి చేసి గాయపరిచారు. స్థానికులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు లారీ డ్రైవర్స్ అసోసియేషన్ నేతలతో కలిసి 50 మందికిపైగా శనివారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. వీరంతా గుమికూడి ఉండగా టూటౌన్ సీఐ రాజారెడ్డి రాష్ట్రీయ చాలక్ ఏకతా మబ్ లారీ వర్కర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సర్థార్ హుసేన్‌ను కొట్టి లాక్కుపోయి లోపల కూర్చోబెట్టాడు. దీంతో అసోసియేషన్ ఛైర్మన్ అబూబ్‌షేక్ ఆధ్వర్యంలో సీఐ రాజారెడ్డిపై మదనపల్లె డీఎస్పీ మహేంద్రకు, ఎస్పీ ధీరజ్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు అసోసియేషన్ నేతలు తెలిపారు. కాగా డ్రైవర్‌పై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడి సస్పెన్షన్



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గాలివీడు, డిసెంబరు 6(ఆంధ్ర జ్యోతి): తూముకుంట పంచాయతీ కస్బాలో మసీదు నిధులను కాజేసిన తూముకుంట ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎం.పాపాసాహెబ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఆయన విలేఖరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మసీదు అభివృద్ధి కోసం వక్ఫ్ బోర్డు నుంచి విడుదలైన రూ.12 లక్షలు, దాతల నుంచి సేకరించిన మరికొంత సొమ్మును తన స్వంతానికి వాడుకున్నాడని గ్రామ ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామంలో విచారణ చేశామన్నారు. విచారణలో మసీదు నిధులు వాడుకున్నాడని నిర్ధారణ జరిగిందని, వాటిని తిరిగి చెల్లించమని రెండుసార్లు హెచ్చరించినా ఆయన పట్టించుకోలేదన్నారు. ప్రజలకు, పార్టీకి చెడ్డ పేరు తెస్తున్న విషయం అధిష్టానం దృష్టికి తీసుకెళ్లామని, వారి ఆదేశాల మేరకు ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు మహమ్మద్ రియాజ్, శ్రీనివాస రాజు, భద్రత నాయుడు, వక్ఫ్ బోర్డు మాజీ సభ్యులు మహబూబ్ బాషా, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పీలేరులో అట్టహాసంగా ఐక్యతా ర్యాలీ



యూనిటీ మార్చ్‌లో అధికారులు

పీలేరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా శనివారం పీలేరులో యూనిటీ మార్చ్ (ఐక్యతా ర్యాలీ) అట్టహాసంగా జరిగింది. కడప జిల్లా యువజన అధికారి ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ దేశ ప్రథమ హోం మంత్రిగా పనిచేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశంలోని సంస్థానాలన్నింటినీ ఐక్యం చేసి దేశ సమగ్రతను కాపాడారన్నారు. ఆయన జీవితం, ఆశయాల గురించి యువతకు తెలియజేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆయన జయంతిని దేశవ్యాప్తంగా నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా రాయచోటి, పీలేరు పట్టణాల్లో ఐక్యతా ర్యాలీ నిర్వహించామన్నారు. పీలేరు పంచాయతీ కార్యాలయంలో ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివశంకర్, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు చంద్రశేఖర రెడ్డి, ఈఓ బ్రహ్మానంద రెడ్డి, బీజేపీ నేతలు వెంకటరమణ, పురుషోత్తం, స్థానిక నిర్వాహకులు పీవీఎస్ లక్ష్మి, రాయల సుధాకర్, జాతీయ యువ కార్యకర్తలు వెంకటేశ్, నాగరాజు, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

పాత కక్షలతో ఆటో దహనం



మంటల్లో కాలిపోయిన ఆటో

వాల్మీకిపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో ఇరువర్గాలు ఘర్షణ పడి ఆటో దహనం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరు వ్యక్తులు తమకు ఉన్న పాత కక్షల నేపథ్యంలో గాంధీ బస్టాండ్ ప్రాంతంలో ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. ఓ వర్గానికి చెందిన వ్యక్తి ఆటోకు మరొకరు నిప్పు పెట్టారు. ఆటో తగలబడిపోతుండడంతో స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. బస్టాండ్ ప్రాంతంలో ఘర్షణ వాతావరణం చోటు చేసుకోవడం ఎస్ఐ చంద్రశేఖర్ సిబ్బందితో వెళ్లి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇరువర్గీయులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజంపేటలో ఉద్యమం ఉధృతం

- విద్యార్థుల భారీ ర్యాలీ.. పెన్షనర్ల ఆందోళన

రాజంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ చేస్తున్న ఆందోళన రోజురోజుకు ఉధృతమవుతోంది. శనివారం రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ అనంతరం పాతబస్టాండులో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ జనసేన నాయకుడు యల్లటూరు శ్రీనివాసరాజు, బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు షబ్బీర్‌అహ్మద్, మైనార్టీ నాయకులు అబూబకర్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు సమ్మెట శివప్రసాద్ తదితరులు మాట్లాడుతూ రాజంపేటను జిల్లా చేసేంతవరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తూనే ఉంటామని హెచ్చరించారు.




రాజంపేటలో ఆందోళన చేస్తున్న పెన్షనర్లు

పెన్షనర్ల నిరసన ప్రదర్శన

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలంటూ స్థానిక ఎన్జీవో భవనం సమీపంలో పెన్షనర్లు ఆందోళన చేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పిల్లి పిచ్చయ్య, కేడీ వరప్రసాద్, జేఏసీ నాయకులు వర్దిబోయిన సుధాకర్‌బాబు, నీలి ఈశ్వరయ్య, చిట్వేలి రవికుమార్, హరీష్, అలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు, జేఏసీ నాయకుడు అబ్బూరు ప్రభాకర్‌నాయుడు, అల్లం సుబ్రమణ్యం మాట్లాడుతూ రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో విద్యార్థులు, మైనార్టీలు, అన్నివర్గాల ప్రజలు ఉద్యమంలో పాల్గొంటున్నారని వారి ఆకాంక్షలకు అనుగుణంగా రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని డిమాండ్ చేశారు.



రాజంపేటలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

రిలేదీక్షలు

రాజంపేట ఆర్అండ్‌బీ బంగ్లా ఎదుట మున్సిపల్ వైస్‌ఛైర్మన్ మర్రి రవి ఆధ్వర్యంలో రిలే దీక్షలు ప్రారంభించారు. జిల్లా కేంద్రం ప్రకటించేవరకు ఆమరణదీక్ష చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కువైట్‌లో ఎన్ఆర్ఐల నిరసన

కువైట్‌లో ఎన్ఆర్ఐలు నిరసన ప్రదర్శన చేశారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని నినాదాలు చేశారు. ఈ మేరకు కువైట్‌లోని భారతీయ రాయబార కార్యాలయంలో వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

● ఇరువర్గాల ఘర్షణ

కడప, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు పనుల విషయమై టీడీపీలో విభేదాలు భగ్గుమన్నాయి. చక్రాయపేట మండలంలోని కె.రాచుపల్లె సమీపాన రోడ్డు పనుల కోసం ఇరువర్గాలు సిగపట్లు పట్టారు. మండల ఇన్‌చార్జి మహేశ్వర్‌రెడ్డి వర్గం, మరో వైపు కర్నాటి భరత్‌రెడ్డి, కర్నాటి అమర్‌నాథ్‌రెడ్డి వర్గానికి చెందిన వారు పెద్ద ఎత్తున మోహరించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చివరకు పోలీసులు జోక్యం చేసుకొని పరిస్థితిని సద్దుమణిచారు. ఆ వివరాల్లోకి వెళితే.. రాచుపల్లె గ్రామ సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద నుంచి పొలాలకు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణ కాంట్రాక్టు పనులను కర్నాటి మురళీధర్‌రెడ్డి దక్కించుకున్నారు. ఈ పనులు చేపట్టేందుకు అక్కడకు వెళ్లగా.. మహేశ్వర్‌రెడ్డి అనుచరులైన శ్రీరామ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి అక్కడకు చేరుకొని ముందుగా పనుల కోసం తాము ప్రయత్నించామంటూ అడ్డుకున్నారు. అదే సమయంలో కర్నాటి భరత్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి తమ అనుచరులతో భారీ ఎత్తున అక్కడకి చేరారు. దీంతో ఇరువర్గాల వారు వాగ్వాదానికి దిగడంతో స్వల్ప ఘర్షణ జరిగింది. దీంతో కొందరికి స్వల్పగాయాలయ్యాయి. అంతలో పోలీసులు అక్కడకు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. ఇరువర్గాలకు నచ్చజెప్పినప్పటికీ ససేమిరా అని భీష్మించడంతో సీఐ జోక్యం చేసుకొని బెటాలియన్‌ను దింపి ఇరువర్గాలను చెదరగొట్టి అక్కడ నుంచి పంపారు. ప్రస్తుతం పరిస్థితి సద్దుమణిగినప్పటికీ ఏ క్షణంలో ఏం జరుగుతుందో అనే ఉత్కంఠ నెలకొంది. ఈ సంఘటనతో టీడీపీలో మాత్రం వర్గ విబేధాలు భగ్గుమన్నాయి.

అభ్యంతరాలను 30లోగా తెలపాలి

కడప కలెక్టరేట్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ల మెరిట్ జాబితా అధికారిక వెబ్‌సైట్‌లో ఉందని, అభ్యంతరాలు ఉంటే తెలపాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోని జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితా kadapa.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉందని, అభ్యతరాలుంటే ఈనెల 30వ తేదీలోగా డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో సాయంత్రం 5గంటల లోపు ఆధారాలతో ఫిర్యాదు చేయాలని ఆ ప్రకటనలో తెలిపారు.

క్వాంటమ్ కోర్ కాన్సెప్ట్‌పై అవగాహన

వేంపల్లె, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో నాలుగు రోజులుగా జరుగుతున్న క్వాంటమ్ శిక్షణ సమావేశంలో శనివారం క్వాంటమ్ కంప్యూటింగ్ కాన్సెప్ట్‌పై అవగాహన కల్పించారు. హైదరాబాద్‌కు చెందిన సీడాక్ కంపెనీ ప్రతినిధి అభిజిత్ తేజ్ విద్యార్థులకు క్వాంటమ్ కంప్యూటింగ్ వివరాలు తెలిపారు. గ్రోవర్ ఆల్గరిథమ్, డయాస్ ఆల్గరిథమ్, క్వాంటమ్ సర్క్యూట్ తయారీపై వివరించారు. ఈ సందర్భంగా అభిజిత్ తేజ్‌ను డైరెక్టర్ గుప్తా, ఏవో రవికుమార్ ఇతర అధికారులు సత్కరించారు.

అధికార లాంఛనాలతో డీఎస్పీ అంత్యక్రియలు

కలసపాడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అధికార లాంఛనాలతో శనివారం 11వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ (డీఎస్పీ) కందుల వెంకటరెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. శుక్రవారం అనారోగ్యంతో ఆయన మృతి చెందిన విషయం తెలిసిందే. స్వగ్రామమైన అక్కివారిపల్లెలో శనివారం సాయంత్రం పోలీసుల లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు. కార్యక్రమంలో ఎస్సీఎస్టీ సెల్ అడిషనల్ కమాండెంట్ కె.సాంబయ్య, 11వ బెటాలియన్ కమాండెంట్ పీఎన్‌డీ ప్రసాద్, ఆర్ఐ కె.నాగరాజు, ఆర్ఎస్ఐ డీవీ సుబ్బారావు, ఏఆర్ఎస్ఐ టీఈ రమణ, పోరుమామిళ్ల ఎస్ఐ కొండారెడ్డి, కలసపాడు పోలీసులు పాల్గొన్నారు.

నీటికుంటలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

కడప క్రైం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కడప నగరం రిమ్స్ సమీపంలో మానసిక పరిస్థితి సరిగాలేని వ్యక్తి నీటికుంటలో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు... ప్రొద్దుటూరు పట్టణం కల్లూరు గ్రామానికి చెందిన సుమంత్(29) మతిస్థిమితం(మానసికపరిస్థితి) సరిగ్గా లేకపోవడంతో వైద్య పరీక్షల నిమిత్తం కడప రిమ్స్‌కు తీసుకొచ్చారు. అదేరోజు హాస్పిటల్ నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. శనివారం రిమ్స్ సమీపంలో సుమంత్ మృతదేహాన్ని గుర్తించామని, మృతుడి భార్య సుష్మిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు.

ప్రత్యామ్నాయంపై మక్కువ..

● కొత్త పంటల వైపు రైతుల చూపు ● విస్తరిస్తున్న డ్రాగన్ ఫ్రూట్స్, ఆయిల్‌ఫామ్, వెదురు, అవకాడో


ఓబులవారిపల్లె మండలంలో సాగులో ఉన్న డ్రాగన్‌ఫ్రూట్

ఓబులవారిపల్లె, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో వ్యవసాయమే జీవనాధారంగా రైతులు జీవనం సాగిస్తున్నారు. మామిడి, అరటి, బొప్పాయ పంటలతో పచ్చగా కళకళలాడుతూ ఉన్న ఈ నియోజకవర్గాన్ని రెండో కోనసీమగా అభివర్ణిస్తారు. భూగర్భజలాలు అంతంత మాత్రమే అయినా.. గల్ఫ్‌దేశాలకు వెళ్లి సంపాదించుకున్న రూపాయలను ఖర్చు పెట్టి ఉన్న భూములను సాగులోకి తీసుకువస్తుంటారు. ప్రస్తుతం వాణిజ్య పంటలకు అంత డిమాండ్ లేకపోవడంతో ఉన్న పంటలకు మంగళహారతి పట్టేందుకు రైతులు సిద్ధపడుతున్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని ఉద్యాన అధికారులు చెబుతున్నారు. వీటిల్లో ముఖ్యంగా డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, ఆయిల్‌ఫామ్, వెదురు తోటలను సాగు చేయడానికి ముందుకు వస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సబ్సిడీతో ప్రోత్సహించడంతో వీటి విస్తీర్ణం యేటా పెరుగుతోంది. అంతేకాకుండా ఉపాధి హామీ పథకంలో నూతన పంటలకు ప్రోత్సాహకాలిస్తుండటంతో రైతులు మరింత ఆసక్తి చూపుతున్నారు.

డ్రాగన్‌ఫ్రూట్

డ్రాగన్‌ఫ్రూట్ సాగు ప్రస్తుతం మంచి డిమాండ్ ఉన్న పంటగా చెబుతున్నారు. ఒకటిన్నర మీటర్ల దూరం స్తంభాలు, ట్రెల్లీస్ పద్ధతిలో సాగు చేయవచ్చు. ఇది ఉష్ణ మండలాల


బొజ్జావారిపల్లె పంచాయతీలో అవకాడో పంటను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారితో రైతు

పండు. మూడో సంవత్సరం నుంచి దిగుబడి వస్తుంది. డ్రాగన్ పువ్వు వచ్చిన 25 నుంచి 30 రోజుల్లో పండుగా మారుతుంది. ఇందులో మంచి పోషకాలు, విటమిన్‌లు, ఖనిజాలు ఉంటాయని వైద్యులు సైతం సూచించారు. ఇది సుమారు వందలాది ఎకరాల్లో సాగులోకి వస్తున్నది.

ఆయిల్‌ఫామ్

ఈ పంట సాగు సుమారు వందల ఎకరాల్లో నమోదవుతున్నది. యేటా సాగును పెంచడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీర్ఘకాలికంగా మంచి ఆదాయాన్ని ఇచ్చే పంటగా చెబుతున్నారు. వరి, పత్తి పంటల కంటే తక్కువ ఖర్చు, ఎక్కువ ఆదాయం. ఇది 20 మీటర్ల ఎత్తు వరకు పెరుగుతుంది. ఆయిల్‌ఫామ్ సాగును మే, జూన్ నెలల్లో ప్రారంభిస్తారు. ఎటు చూసినా మొక్కకు మొక్కకు 9 మీటర్ల దూరంతో నాటుకోవాలి. హెక్టారుకు 140 మొక్కల వరకు పెంచుకోవచ్చు. మూడు సంవత్సరాల వరకు మొక్కకు నీరు ఎక్కువగా పెట్టాలి. రెండున్నర నుంచి మూడు సంవత్సరాల లోపు దిగుబడి మొదలవుతుంది. ఇది 30 నుంచి 40 సంవత్సరాల వరకు దీర్ఘకాలిక ఆదాయాన్నిచ్చే పంటగా అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రైతులు మామిడి పంటను తీసివేసి ఆయిల్ ఫామ్ సాగుకు సిద్ధమవుతున్నారు.

వెదురు

ఈ వెదురు పంటను ఆకుపచ్చ బంగారంగా అభివృద్ధి చేస్తారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ మిషన్ ప్రాజెక్టు కింద ప్రత్యేకంగా వెదురు సాగును ప్రోత్సహిస్తూ రాయితీలు అందిస్తున్నారు. బీడు భూముల్లో వెదురు సాగు చేస్తే మంచి ఆదాయం ఇచ్చే అవకాశం ఉంటుందని గ్రామీణ పేదలను ప్రోత్సహిస్తున్నారు. భవిష్యత్‌లో మంచి ఆదాయం వస్తుందని, డ్వాక్రా సంఘాల మహిళలను కూడా ప్రోత్సహించి సాగు చేపడుతున్నారు. వీటి సాగు విధానం 60 సెం.మీ గుంతల్లో నాటుకోవాలి. హెక్టారుకు 400 మొక్కల వరకు ఎటు చూసినా మొక్కకు మొక్కకు 5 మీటర్ల దూరంలో నాటుకోవాలని తెలిపారు. ఇవి మూడు సంవత్సరాల తర్వాత నుంచి దిగుబడి మొదలవుతుంది.

అవకాడో

ఈ పంట సాగుకు నియోజకవర్గ పరిధిలో అనుకూలమైన నేలలు ఉండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. వెచ్చని తేమ, అధిక ఎండ ఉన్న నేలలు అవకాడో సాగుకు అనుకూలంగా ఉంటాయని ఉద్యాన అధికారులు తెలిపారు. ఎకరాకు 160-170 వరకు మొక్కలు పెంచుకోవచ్చు. విత్తనాల ద్వారా సాగు చేస్తే 10 సంవత్సరాలకు దిగుబడి వస్తుంది. అదే అంటు మొక్కల ద్వారా అయితే 3-4 సంవత్సరాల్లో దిగుబడి మొదలవుతుంది. ఇది ప్రస్తుతం మంచి రేటు ఉన్న పంట.

మక్కువ చూపుతున్న రైతులు..



నియోజకవర్గంలోని రైతులు సంప్రదాయ పంటలపై మక్కువ చూపుతున్నారు. నూతనంగా పరిచయమైన డ్రాగన్‌ఫ్రూట్‌ను వందలాది ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అలాగే ఆయిల్‌ఫామ్, అవకాడో వంటి నూతన పంటలు సాగు చేసేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. అందుకు తగ్గట్టు తాము కూడా ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, సాగు విధానాల గురించి రైతులకు వివరిస్తున్నాం.

- భాస్కర్, ఉద్యానశాఖాధికారి

ఏ పంట వేసినా నష్టపోయా..



ప్రతి యేటా ఎన్నో ఆశలు పెట్టుకొని పంటలు పండిస్తే చివరికి నష్టాలే మిగులుతున్నాయి. కొంతమంది సలహాలు, ప్రత్యామ్నాయ పంటలపై సామాజిక మాధ్యమాల్లో చూసి అధికారుల సలహాలతో ఆయిల్‌ఫామ్ సాగును అరటిలో చేపట్టాం. ప్రస్తుతం ఉన్న మామిడి చెట్లను తీసివేసి కొత్త పంటలు సాగు చేస్తున్నారు. తాను కూడా కొత్త ప్రయత్నం చేస్తున్నాను.

- శంకర్‌రెడ్డి, ఆయిల్‌ఫామ్ రైతు


బొమ్మవరంలో సాగులో ఉన్న వెదురు పంట

చెన్నూరు బీఎల్వోలపై డీఆర్వో ఆగ్రహం

● ఓటర్ల జాబితా సరిపోల్చడంలో అలసత్వంపై మందలింపు




బీఎల్వోల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

చెన్నూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాను సరిచేయాలని చెప్పినా ఇంతవరకు ఎందుకు సరిచూసి సక్రమంగా చేయలేదని చెన్నూరు బీఎల్‌వోలపై జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు అసహనం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో సభాభవనంలో శనివారం సాయంత్రం బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీఎల్‌వోలను 1.1.2002 నుండి ఇప్పటి వరకు ఉన్న తేదీలో అప్పటి ఓటర్ల జాబితా చూసి ఇప్పటి ఓటర్ల జాబితాలో పాతవ్యక్తులు ఉన్నారా? ఇప్పటి వరకు ఉన్న వారిని సరిపోల్చాలని, జాబితా సక్రమంగా చేయాలని చెబితే ఎందుకు సరిచేయలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు ఇలాగేనా ఉండేదని, సస్పెండ్ చేస్తే దేవుడు కూడా కాపాడలేడని హెచ్చరించారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి ఈనెల చివరి నాటికి వంద శాతం పూర్తిచేయాలన్నారు. అలాగే బీఎల్‌వోలు వారి వారి పరిధిలో రోజూ కొంత సమయం కేటాయించాలని, మిగతా విధులు ఉన్న మాట వాస్తవమే అయినా కేంద్రం చెప్పిన బాధ్యత కూడా ముఖ్యమేనన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీచరణి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


శ్రీచరణి తండ్రికి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే మాధవి

కడప స్పోర్ట్స్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మహిళా క్రికెట్ (వరల్డ్‌కప్)లో అద్భుత ప్రతిభ కనబరిచిన శ్రీచరణి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, జిల్లాకు పేరుప్రఖ్యాతులు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆర్.మాధవి ఆకాంక్షించారు. శ్రీచరణి ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షిస్తూ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి వ్యక్తిగతంగా ఆర్థికసాయం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం స్థానిక శనివారం స్థానిక ద్వారకానగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీచరణి తండ్రికి రూ.5లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో కడప క్రికెట్ స్టేడియం చైర్మన్ ఆర్.శ్రావణ్‌రాజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్లేషణలు వ్యాపారాభివృద్ధికి కీలకం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విశ్లేషణలు వ్యాపార అభివృద్ధికి ఉపయోగకరంగా ఉంటాయని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయం బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం నిర్వహించిన క్రాస్-ఫంక్షనల్ మేనేజ్‌మెంట్ అనలిటిక్స్ ఫర్ బిజినెస్ సక్సెస్ రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్క్‌షాప్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడిందన్నారు. ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డీవీ శ్రీనివాసకుమార్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం డాక్టర్ సి.గణేష్‌కుమార్ వ్యాపార విశ్లేషణల ప్రాధాన్యంపై కీలక ప్రసంగాలు చేశారు. విభాగాధిపతి డాక్టర్ పి.సరిత వర్క్‌షాప్ విద్యార్థుల్లో డేటా సేకరణ, విశ్లేషణలో ఆధునిక అవగాహన పెంచిందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రూపాయి పతనంతో ఆర్థిక పరిస్థితి విచ్ఛిన్నం

● కార్మిక చట్టాలను నీరుగారుస్తున్న కేంద్ర ప్రభుత్వం ● ధ్వజమెత్తిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

కడప మారుతీనగర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రూపాయి విలువను పెంచి దేశ ఆర్థిక పరిస్థితిని గణనీయంగా మెరుగుపరుస్తామని మాట ఇచ్చిన ప్రధాని మోదీ దేశ ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేయడం తప్ప ప్రగతి సాధించేదేమీ లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా కేంద్రంలో ఉన్న బీజేపీ రూపాయి విలువను గణనీయంగా తగ్గించారని, మనతో పోల్చుకుంటే చైనా ఐదు రెట్లు జీడీపీ రేటుతో ముందుందన్నారు. విశాఖ స్టీలు ప్లాంటును ప్రైవేటుపరం చేయాలనుకుంటున్నారని, దీనివల్ల ప్రజలకు ఏం ప్రయోజనమని ఆయన ప్రశ్నించారు. సాగు, తాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేసి రైతుల బతుకులను నట్టేట ముంచారన్నారు. కార్మిక చట్టాలను అణగదొక్కుతూ దళిత ఆదివాసీ, గిరిజన, మైనార్టీలపై దాడులు చేస్తూ వారిపై నక్సలైట్లు, సంఘ విద్రోహ శక్తుల ముద్ర వేసి పీడీ యాక్టు చట్టాలు ప్రయోగించడం ఒక్క మోదీకే చెల్లిందని విమర్శించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు వెంకటశివ, బాదుల్లా, గుంటి వేణుగోపాల్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

తెలుగుభాష, సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలి

● వైవీయూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పద్మ

కడప మారుతీనగర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలుగుభాష, సాహిత్యంపై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ సూచించారు. సీపీ బ్రౌన్ వర్ధంతి సందర్భంగా ఈనెల 6 నుండి 12వ తేదీవరకు వారోత్సవాలను వైవీయూ ఆధ్వర్యంలో సీపీ బ్రౌన్ పరిశోధన కేంద్రంలో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మొదటి రోజు శనివారం ప్రారంభ సమావేశంలో పద్యపఠన పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆచార్య పిపద్మ హాజరై మాట్లాడారు. సీపీ బ్రౌన్ కృషి వల్లనే వేమన తెలుగు నేలలో చిరస్థాయిగా నిలచిపోయారన్నారు. వేమన పద్యాలను ఇవాళ పాట స్థాయిలో విద్యార్థులు చదువుకోగలుగుతున్నారన్నారు. ముఖ్యంగా విద్యార్థులు గ్రంధాలయానికి వెళ్లడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య పార్వతి, బ్రౌన్ గ్రంధాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సరైన అవగాహన కల్పించాలి


సందర్శన కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏలు తదితరులు

సీకేదిన్నె, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అధికారులు రైతులకు సరైన అవగాహన కల్పించి పంట దిగుబడులు పెంచేలా చూడాలని వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వర్షాలు అధికంగా కురవడంతో రైతులు పంటల సస్యరక్షణకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంటల్లో లోపాలు గుర్తించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు రైతులకు వివరించాలన్నారు. దీంతో రైతులు తెగుళ్లబారి నుండి పంటలను రక్షించుకుని దిగుబడులు పెంచుకుంటారన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కొర్రపాటి సునీల్‌కుమార్, వాకా మాధురి, శ్రీవల్లి, ఏడీఏలు నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కేవీకే సమన్వయకర్త అంకయ్యకుమార్, ఏరువాక కేంద్రం సమన్వయకర్త క్రిష్ణప్రియ పాల్గొన్నారు.

పర్వతారోహణ శిక్షణ పూర్తి

● కోటిరెడ్డి కళాశాల విద్యార్థినులకు అభినందనలు


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాష తదితరులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కడప పట్టణంలోని కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు సి.పావని, కె.జాహ్నవి హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలిలో ఉన్న అటల్‌బిహారి వాజ్‌పేయి మౌంటెనీరింగ్ అలీడ్ స్పోర్ట్స్ సంస్థలో జరిగిన అడ్వెంచర్ శిక్షణను పూర్తిచేసుకున్నారు. శనివారం కడప నగరం కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులను ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జి.విజయలక్ష్మీదేవి, డాక్టర్ పి.శచీదేవి అభినందించారు.

అంత్యక్రియలు నిర్వహించకుండా ఘర్షణ

మైదుకూరు డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మైదుకూరు మండలం నాగిరెడ్డిపల్లిలో శ్మశానం కోసం ఇరువర్గాల మధ్య శనివారం ఘర్షణ వాతావరణం ఏర్పడింది. నాగిరెడ్డిపల్లికి చెందిన శివపురం పోలయ్య అనారోగ్య కారణంగా మరణించడంతో శనివారం దహన సంస్కారాలు చేయడానికి తీసుకువెళుతున్న సందర్భంలో సోమయాజులపల్లికి చెందిన బాలనాగయ్య తన పొలంలో నుంచి వెళ్లేందుకు అడ్డుపడడం జరిగింది. మృతుని బంధువులు ఇది తరతరాలుగా తమ గ్రామానికి చెందిన శ్మశాన స్థలమని, ఆ పొలంలోనే ఖననం చేయడానికి గొయ్యి తవ్వడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువర్గాలకు సర్దిచెప్పే ప్రయత్నం చేసి పొలయజమాని బాలనాగయ్యను ఒప్పించారు. కాని మృతుని బంధువులు ససేమిరా ఒప్పుకోక పోవడంతో తహసీల్దారు రాజసింహనరేంద్ర రంగప్రవేశం చేసి ఇరువర్గాలను మందలించి శ్మశానానికి శాశ్వితంగా దారి ఇవ్వాలని ఆదేశించారు. శ్మశానానికి హద్దులు ఏర్పాటు చేయాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. అనంతరం తహసీల్దారు, సీఐ రమణారెడ్డి, ఎస్ఐ చిరంజీవి పోలీసుల సమక్షంలో మృతదేహానికి బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు.

గండికోట వెనుకజలాల్లో బాలుడి మృతదేహం లభ్యం

కొండాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కొండాపురం రైల్వే బ్రిడ్జి సమీపంలో గండికో ట వెనుకజలాల్లో శనివారం బాలుడి మృత దేహం లభ్యమైంది. పోలీసుల వివరాల మేరకు... గండికోట వెనుకజాలల్లో పడిఉన్న మృతదేహాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో జాలర్ల సహాయంతో మృతదేహాన్ని వెలికితీ శారు. తాడిపత్రి పట్టణానికి చెందిన గంగాధర్(15)గా మృతదేహాన్ని గుర్తించారు. మృతికి గల కారణాలను విచారిస్తున్నట్లు కొండాపురం సీఐ రాజా తెలిపారు. గంగాధర్ తల్లిదండ్రుల స్వగ్రామం ముద్దనూరు మండలం గంగాదేవిపల్లె కాగా తాడిపత్రిలో నివాసం ఉంటున్నారు. గంగాధర్ తాడిపత్రిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నట్లు తెలిసింది.


గండికోట వెనుకజలాల్లో లభ్యమైన బాలుడి మృతదేహం

జిల్లా కేంద్రం చేయకుంటే ఆందోళన ఉధృతం

● వెల్లువెత్తుతున్న ఆందోళనలు ● ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను కడప జిల్లాలో చేర్చాలని డిమాండ్ ● జడ్పీ సమావేశంలో ప్రస్తావించిన జడ్పీటీసీ సభ్యుడు



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న ముద్దు కృష్ణారెడ్డి



రైల్వేకోడూరు: రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలంటూ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



ఒంటిమిట్ట: రిలే నిరాహార దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు

రైల్వేకోడూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజంపేటను జిల్లా కేంద్రం చేయకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని కేఎస్‌యూఎఫ్ (కోడూరు స్టూడెంట్ యూనియన్ ఫోర్స్) వ్యవస్థాపక అధ్యక్షుడు బండారు మల్లికార్జున హెచ్చరించారు. శనివారం రైల్వేకోడూరు పట్టణంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజంపేట ను జిల్లా కేంద్రం చేయాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని తెలిపారు. ప్రజాభిప్రాయం మేరకు రాజంపేటను జిల్లా కేంద్రంగా మార్చాలని, మదనపల్లెలో మూడు నియోజకవర్గాలే ఉండడంతో రాయచోటిని ఆ జిల్లాలో కలిపితే సమస్య పోతుందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలన్నారు. లేదంటే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కేఎస్‌యూఎఫ్ ఉపాధ్యక్షుడు హస్తి భరత్‌కుమార్‌రాజు, మల్లెం హేమంత్, జనసేన నాయకులు మర్రిరెడ్డి ప్రసాద్, బీజేపీ నాయకులు సాయం శ్రీధర్, వాకచర్ల సుబ్బారావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలను కడప జిల్లాలో ఉంచాలి

సిద్దవటం: సిద్దవటం, ఒంటిమిట్ట రెండు మండలాలను కడప జిల్లాలోనే ఉంచాలని కోరుతూ రెండు మండలాలకు చెందిన పలువురు శనివారం రాయచోటి తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో రవాణా, యువజన క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ రెండు మండలాల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు శనివారపు మోహన్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు, క్లస్టర్ మాజీ ఇన్‌చార్జి దారపునేని దశరథరామానాయుడు, బాకరా పేట సర్పంచ్ ప్రతినిధి తుర్ర ప్రతాప్‌నాయుడు, మాధవరం-1 యూనిట్ ఇన్‌చార్జి పేగడ హరిప్రసాద్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టను కడపజిల్లాలోనే ఉంచాలి : జడ్పీటీసీ ముద్దు కృష్ణారెడ్డి

ఒంటిమిట్ట: ఒంటిమిట్టను కడపజిల్లాలోనే ఉంచాలని జడ్పీటీసీ సభ్యుడు ముద్దు కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కడప జిల్లా పరిసత్ సమావేశంలో ఆయన ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట మండలాన్ని కడప జిల్లాలోనే కొనసాగించాలని లేదంటే రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటిస్తూ తీర్మానం చేయాలని కోరారు

నిరాహార దీక్షలు ప్రారంభం

ఒంటిమిట్ట మండలాన్ని కడప జిల్లాలోనే ఉంచాలంటూ మండల జేఏసీ నాయకులు స్థానిక కోదండరామాలయం సమీపంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. పాటూరు గంగిరెడ్డి, అడ్వకేట్ రామదాసు, కట్టా యానాదయ్య, గజ్జల నరసింహారెడ్డి, ఎస్వీ రమణ, తుమ్మలపెంట ఈశ్వరయ్య, బొబ్బిలి రాయుడు, కట్టా సుబ్బా రాయుడు, సిగే భాస్కర్‌రెడ్డి, డీలర్ వెంటకసుబ్బయ్య, రోశయ్య, భానుప్రకాష్‌రాజు, సామ్రాట్, సుబ్బారెడ్డి,ప్రజలు పాల్గొన్నారు.

చిట్వేలి ఎస్‌ఐగా వినోద్‌కుమార్



చిట్వేలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చిట్వేలి ఎస్‌ఐగా ఎస్. వినోద్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా, కోడిపందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. దళిత సంఘాల నేతలు ఎస్‌ఐని కలిసి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో తమ వంతు సహకారం అందిస్తామన్నారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రామాపురం ఎస్‌ఐగా శివకుమార్



రామాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రామా పురం ఎస్‌ఐగా బి.ఎం.శివకుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. మదనపల్లె టూ టౌన్ పోలీసు స్టేషన్ నుంచి బదిలీపై వెళ్లిన ఆయన రామాపురం ఎస్‌ఐగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కోడిపందేలు, జూదం, గంజాయి, మాదకద్రవ్యాలు, బెల్టు షాపులు వంటి చట్టవ్యతిరేక చర్యలు చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్‌ఐకి సన్మానం



సుధాకర్ రెడ్డిని సన్మానిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ రమేశ్ రెడ్డి, తదితరులు

రామాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రామాపురం నుంచి బదిలీ అయిన ఎస్‌ఐ వెంకట సుధాకర్ రెడ్డిని లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎం.రమేశ్ రెడ్డి, టీడీపీ నాయకులు ఎం.ఎల్.వెంకటరామిరెడ్డి, శివారెడ్డి, మండల బీజేపీ నాయకులు గంప సుబ్బారాయుడు, తదితరులు శనివారం ఘనంగా సన్మానించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

●మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



చిన్నమండెం: సంత భవనం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సతీమణి హరిత

చిన్నమండ్యం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. శనివారం చిన్నమండ్యంలో శనివారం పర్యటించారు. రూ. 20 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో తన సతీమణి హరితతో కలసి మంత్రి వారపు సంత భవనం నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిర్విరామంగా పని చేస్తున్నదని తెలిపారు. భవిష్యత్తులో రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మూగి రెడ్డన్న, టీడీపీ నేతలు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, వ్యాపారులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌ను విద్యాహబ్‌గా అభివృద్ధి చేస్తాం..

రాబోయే రోజుల్లో రాష్ట్రాన్ని విద్యాహబ్‌గా అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. బోరెడ్డిగారిపల్లిలో శనివారం ప్రజాదర్బార్ సందర్భంగా ఆయన మాట్లాడారు.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

రాయచోటి నేతాజీ సర్కిల్ : పేదవాడి ఆరోగ్యానికి కొండంత అండ సీఎం సహాయనిధి అని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం 55 మంది అనారోగ్య బాధితులకు రూ.49.44 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న సంకల్పంతో సీఎం సహాయ నిధి ద్వారా ఆదుకుంటున్నారన్నారు. రాయచోటి నియోజకవర్గంలో 18 నెలల్లో రూ.7.30 కోట్ల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. వైద్య సాయం అందుకున్న రోగుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని, వారి యోగక్షేమాలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. నిరుపేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుదన్నారు. రాయచోటి నియోజకవర్గంలో సీఎం సహాయ నిధి నుంచి లబ్ది పొందిన వారి తరపున ముఖ్యమంత్రికి మంత్రి రాంప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రికి రుణపడి ఉండాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మంత్రి సోదరులు లక్ష్మీప్రసాద్ రెడ్డి, అర్చన విద్యాసంస్థల అధినేత మదన మోహన రెడ్డి, రాయచోటి క్లస్టర్ ఇన్‌ఛార్జ్, మైనారిటీ నాయకులు గాజుల ఖాదర్ బాషా, ఏపీఐఐసీ డైరెక్టర్ కొండ భాస్కర రెడ్డి, సంబేపల్లె క్లస్టర్ ఇన్‌ఛార్జ్ విష్ణువర్ధన్ రెడ్డి, గడికోట సుధాకర్, వివిధ మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

●ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా



రాజంపేట: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న పోతుగుంట రమేష్‌నాయుడు



రైల్వేకోడూరు: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అరవ శ్రీధర్, ముక్కా

రైల్వేకోడూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని జనసేన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. శనివారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా రైల్వేకోడూరులో అంబేడ్కర్‌విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. అంబేడ్కర్ దేశానికి చేసిన సేవను విస్మరించరాదన్నారు. ఆయన ఆలోచనలు ఈ తరం యువతలో మరింత వ్యాప్తి చెందాలన్నారు. అంటరానితనాన్ని నిర్మూలించేందుకు అంబేడ్కర్ చేసిన కృషి మరవ లేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, పోకల మణి, పఠాన్ మౌలా, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, పోతురాజు సుమన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర గ్రీనరీ, బ్యూటిఫికేషన్ డైరెక్టర్ అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు. రైల్వేకోడూరు మాజీ శాసన సభ్యుడు కొరముట్ల శ్రీనివాసులు వేర్వేరుగా నివాళి అర్పించారు.

రాయచోటి టౌన్: రాయచోటిలోని తహసీల్దారు కార్యాలయ సమీపంలో ఉన్న అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద ప్రజాసంఘాల నాయకులు నివాళులు అర్పించారు. అన్ని మతాలు గౌరవించి ఆచరించే పవిత్ర గ్రంథంగా మన రాజ్యాంగం ఉన్నదని, రాజ్యాంగ ఆశయాలు, లక్ష్యాలను ముందుకు కొనసాగించినప్పుడే అంబేడ్కర్‌కు నిజమైన నివాళి అని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య హక్కుల పరి రక్షణ సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి, న్యాయ వాది టి. ఈశ్వర్, ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయ కుడు రామాంజనేయులు, ఏపీసీఎల్‌సీ జిల్లా నాయకుడు పి.రెడ్డయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుధీర్ కుమార్, ఎల్‌హెచ్ పీఎస్ నాయకులు విశ్వనాథ నాయక్, రజక సం ఘం నాయకులు శ్రీనివాసులు, వడ్డెర విద్యా వంతుల వేదిక నాయకులు జీవానందం, వల్లెపు శ్రీరాములు, కాంగ్రెస్ నాయకులు చెన్నకృష్ణ, ఎంఆర్‌పీఎస్ యువ నాయకులు మహేశ్ బాబు, న్యాయవాదులు వరలక్ష్మి, ఆనంద్ కుమార్, రవిశంకర్, వెంకటరమణ, నాగేశ్వరరావు, ఎంఆర్‌పీఎస్ నాయకులు నాగయ్య, లక్ష్మీనారాయణ, విద్యార్థి, దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: రాజంపేటలో టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు శ్రీశైలం దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రమణయ్య, ఆదినారాయణ, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు జలహారతి



బుడుగుంటపల్లె చెరువు లో జలహారతి సమర్పిస్తున్న ముక్కా వరలక్ష్మి

రైల్వేకోడూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : మండలం లోని కే. బుడుగుంటపల్లె గ్రామ సమీపం లో ఉన్న ఇటీవల కురిసిన వర్షాలకు నిండిన సందర్భంగా శనివారం టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి జలహారతి సమర్పించారు. సాగుకు అనుకూలంగా చెరువుల్లో నీరు చేరింద న్నారు. రైతులు బాగుంటే దేశం బాగుం టుందన్నారు. ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు సుబ్బిరామిరెడ్డి, శేఖర్, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుతో తప్పని తిప్పలు

సిద్దవటం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రహదారి దెబ్బతినడంతో వాహనాలకు మండలంలో వాహనాల సంచారం ఇబ్బందికరంగా మారింది. సిద్దవటం నుంచి బద్వేలుకు వెళ్లే ప్రధాన రహదారిలో దిగువపేట నుంచి కమ్మపాళెం వరకు రహదారి గుంతలమయం కావడంతో వాహనాల నిర్వాహకులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో రహదారి కనపడక ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని ప్రయాణికులు తెలిపారు. దెబ్బతిన్న రహదారిపై ఆర్ అండ్ బి డీఈ షేక్‌షావల్లిని వివరణ కోరగా రహదారి దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించామని, పనులు చేసేందుకు గుత్తేదారునికి తెలిపామని, వారంలోపుల పనులు పూర్తి చేస్తామన్నారు.

పంచాయతీ కార్యాలయ భవనానికి భూమిపూజ

రైల్వేకోడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరపల్లెలో శనివారం ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ అరవ శ్రీధర్, రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సౌలభ్యం కోసం గ్రామ పంచాయతీ కార్యాలయాలు పని చేస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,పాల్గొన్నారు.

చెరువు నీరు వృథా కాకుండా చూడాలి



తూమును పరిశీలిస్తున్న ఏఈఈ వేణుగోపాల్

ఓబులవారిపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దఓరంపాడు చెరువు తూములు దెబ్బతినడంతో నీరు వృథా అవుతోందని నీటిసంఘం అధ్యక్షుడు సుబ్బరాయుడు, ఉపాధ్యక్షుడు ఓరుగుంట ధర్మతేజ శనివారం ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇన్‌ఛార్జి ఏఈఈ వేణుగోపాల్ పెద్దఓరంపాడు చెరువు తూము వద్దకు చేరుకుని పరిశీలించారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నాగేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాపుపల్లె సమస్యలు పరిష్కరించాలి

ఓబులవారిపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : డేంజర్‌జోన్ పరిధిలో ఉన్న మంగంపేట కాపుపల్లెను సత్వరమే తరలించాలని తహసీల్దారు యామినిని గ్రామస్థులు డిమాండ్ చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన లేఅవుట్‌లలో గ్రామాలకు అవసరమైన మౌలిక వసతులతో పాటు ఆలయాలు, బడులు, పంచాయతీ కార్యాలయాలు, తపాల కేంద్రం వంటివి ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామస్థులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సీపీవో గోపినాథ్ తహసీల్దారుకు విన్నవించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధాకర్, గుత్తిరెడ్డి హరినాథ్‌రెడ్డి, తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు హరిబాబు ,రమణారెడ్డి, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

రాష్ట్రోపాధ్యాయ సంఘం కార్యవర్గం ఏకగ్రీవం



నారాయణరెడ్డి | చిట్టిబాబు | రామాంజనేయులు

చిట్వేలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రోపాధ్యాయ సంఘం చిట్వేలి మండల కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపికైంది. అధ్యక్షుడుగా కె.నారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.చిట్టి బాబు, ఆర్థిక కార్యదర్శిగా పి.రామాంజనేయులు ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకుడుగా అల్లం అశోక్ వ్యవహరించారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, కౌన్సిలర్ హరినాథ్, ఎస్టీయూ నాయకుడు దుర్గరాజు, బాలసుబ్రమణ్యం, రాజశేఖర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

సౌమ్యనాథసేవా ట్రస్టుకు రూ.75 వేలు విరాళం

నందలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సౌమ్యనాథస్వామి ఆలయం వద్ద ఉన్న సౌమ్యనాథ సేవాట్రస్టు శాశ్వత అన్నదాన పథకానికి యెద్దల వెంకటమోక్షిత్ పేరుపైన యెద్దల విజయభాస్కర్ కుమారుడు యెద్దల శాంతిస్వరూప్, కోడలు షర్మిల రూ.75 వేలను అన్నదాన సేవాట్రస్టు కోశాధికారి చక్రాల రామసుబ్బన్నకు శనివారం అందజేశారు. ట్రస్టు చైర్మన్ యెద్దల సుబ్బరాయుడు, ట్రస్టు సభ్యులు పల్లె సుబ్రమణ్యం, చక్రాల సాయినాథ్, వంశీకృష్ణ, పెంచలయ్య, వరదయ్య తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు టెస్ట్ పేపర్ల పంపిణీ

పెనగలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చక్రంపేట ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న పదో తరగతి విద్యార్థులకు శనివారం ప్రధానోపాధ్యాయుడు లేబాకు గోపాలకృష్ణ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బిళ్ళ హరి ప్రసాద్ టెస్ట్ పేపర్లను వితరణ చేశారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కృష్ణకుమారి, ప్రమీల, శ్రీవాణి, పరిమళ, దేవమణి, శ్రీదేవి, షబానా, అన్వర్‌బాషా, మహేంద్ర, సుదర్శన్, శివ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

31న సీఐటీయూ అఖిలభారత మహాసభలు

రాజంపేట టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యల సాధనకై ఈనెల 31న విశాఖలో నిర్వహించే సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు పోస్టర్లు ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రమణ, లక్ష్మీదేవి, ప్రసాద్, ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18వ మహాసభల్లో లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కనీస పెన్షన్ 9 వేలు ఇవ్వాలని తదితర డిమాండ్లపై ఈ 18వ మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు.

వివాదాస్పద రోడ్డు పరిశీలన

సిద్దవటం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తన తోటకు వెళ్లే దారిని ఓ రైతు ఆక్రమించాడంటూ సిద్దయ్య అనే రైతు తహసీల్దారు ఆకుల తిరుమలబాబుకు ఫిర్యాదు చేశాడు. దీంతో తహసీల్దారు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ దారి ఆక్రమణపై అందిన ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతం పరిశీలించామని, ఆ ప్రాంతం చుక్కలభూమి అని, దారి సమస్య పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో కేశవులు, రైతు సిద్దయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పేద కుటుంబానికి 'మన ఊరికోసం' చేయూత

సిద్దవటం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో వేలూరు ఆస్పత్రిలో పది రోజులుగా చికిత్స పొందుతున్న సిద్దవటం మండలం ఉప్పరపల్లెకు చెందిన పొట్ట శివ అనే యువకుడికి చేయూత సంస్థ శనివారం ఆర్థికసాయం చేసింది. పేగులు, కిడ్నీ, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్న అతని వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఇల్లు, బంగారం, తదితరాలు అమ్మి దాదాపు రూ.10 లక్షలు ఖర్చు చేశారు. ఇంకా డబ్బు అవసరం కావడంతో మనవూరి కోసం స్వచ్ఛంద సేవాసంస్థను ఆశ్రయించగా వారు రూ.52 వేలు విరాళం సేకరించి అందులో రూ.7 వేలకు బియ్యం, పప్పు, నూనె లాంటి నిత్యావసర సరకులు ఇచ్చి మిగతా 45 వేల నగదు కుటుంబ సభ్యులకు అందజేశారు. రాజంపేట నియోజకవర్గ జనసేన సమన్వయకర్త అతికారి కృష్ణ రూ.20 వేలు నగదు అందజేశారు.

రూ.50 వేలు ఆర్థిక సాయం

చిట్వేలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో వేలూరు సీఎంసీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతిచెందిన గట్టుమీదపల్లెకు చెందిన అద్దంకి సురేష్ కుటుంబానికి రాజకుంట సర్పంచ్, టీడీపీ యువ నాయకుడు గుత్తి నరసింహ శనివారం రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. గట్టుమీదపల్లెలో సురేష్ పార్థివ దేహానికి నివాళులర్పిం చారు.

టీడీపీ నాయకుడు పెంచలయ్య ఆకస్మిక మృతి

ఒంటిమిట్ట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాలాబాదుకు చెందిన టీడీపీ నాయకులు పెంచలయ్య ఆకస్మికంగా మృతిచెందారు. తిరుపతికి వెళ్లిన ఆయన అక్కడే మృతిచెందడంతో మండల తెలుగుదేశంపార్టీ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్థానిక నాయకులు గజ్జల నరసింహారెడ్డి, ఎస్వీ రమణ, సాలాబాదు బుజ్జి ఆయన కుటుంబానికి రూ.30 వేలు ఆర్థికసాయం అందించారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మరింత సహకారం అందించేందుకు పార్టీ ఉన్నత నేతల దృష్టికి తీసుకెళతామన్నారు. పెంచలయ్య పార్టీకి చేసిన సేవలను గుర్తించుకుని నివాళులర్పించారు.

విద్యార్థిని నూర్ ఆయేషాకు ఘనసన్మానం

పెనగలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మాక్ అసెంబ్లీలో పాల్గొన్న పెనగలూరు ఆదర్శ పాఠశాల విద్యార్థిని షేక్ నూర్ ఆయేషాను శనివారం ప్రిన్సిపాల్ ఎస్.సహజబ్లెస్సి అధ్యక్షతన నిర్వహించిన సభలో అధికారులు. ఈ అభినందించారు. ప్రభుత్వం ఆ విద్యార్థినికి బహూకరించిన జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని విద్యార్థులకు చూపించి ప్రతి విద్యార్థి ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పేటీఎం చైర్మన్ మారంరెడ్డి మీనాక్షి, ఎంఈవో గిరివరదయ్య, ఎంపీడీవో విద్యారావు తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో కోర్టు భవనాల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్

- రూ.23.70 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు
- ఫలించిన నల్లారి సోదరుల కృషి

పీలేరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దశాబ్ద కాలంగా పీలేరు ప్రజలను ఊరిస్తున్న కోర్టు నూతన భవనాల నిర్మాణాల కోసం కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పీలేరులో నాలుగు కోర్టుల సముదాయాలు నిర్మించేందుకు రూ.23.70 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు ఈనెల 4వ తేదీ (గురువారం) రాష్ట్ర న్యాయ, శాసన వ్యవహారాలశాఖ కార్యదర్శి గొట్టపు ప్రతిభాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇంతకాలంగా అనిశ్చితిలో ఉన్న నూతన భవనాల నిర్మాణం వేగవంతం కానుంది.

2013లో మంజూరు, ఆపై అడ్డంకులు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పీలేరు, కేవీ పల్లె, కలకడ, గుర్రంకొండ, వాల్మీకిపురం, కలికిరి, రొంపిచెర్ల, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, సదుం మండలాలు పీలేరు కోర్టుల పరిధిలోకి వస్తాయి. పీలేరులో ప్రస్తుతం 11వ అదనపు జిల్లా జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులు ఉన్నాయి. వీటిలో 11వ అదనపు జిల్లా జడ్జి న్యాయస్థానాన్ని నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంజూరు చేశారు.

సాధారణంగా మునిసిపల్ ప్రాంతాలకు మాత్రమే మంజూరు చేసే జిల్లా కోర్టును ఆయన స్వయంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో మాట్లాడి పంచాయతీ కేంద్రమైన పీలేరులో ఏర్పాటు చేయించారు. ఆ సమయంలోనే పీలేరు కోర్టులకు నూతన భవనాలు నిర్మించాలన్న ప్రతిపాదన ముందుకు రాగా ఆయన స్థల సేకరణ, నూతన భవనాల నిర్మాణానికి అంగీకరించి అందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఆయన చొరవతో మదనపల్లె మార్గంలోని ఈద్గా మైదానానికి ఆనుకుని ఉన్న చెన్నకేశవ స్వామి ఆలయ మాన్య భూములకు పరిహారం చెల్లించి కోర్టుల సముదాయం నిర్మించాలని నిర్ణయించారు. అయితే ఆయన పదవీ కాలంలో పరిహారం విడుదల ఆలస్యం కావడంతో ఆ పనులకు తాత్కాలికంగా బ్రేకులు పడ్డాయి. ఆ తరువాత వచ్చిన టీడీపీ ప్రభుత్వంలో స్థానిక న్యాయవాదుల కృషి ఫలితంగా ఆలయ భూములకు రూ.3 కోట్ల మేర రెండు విడతలుగా పరిహారం మంజూరైంది కానీ నూతన భవనాల కోసం నిధులు మంజూరు కాకపోవడంతో భవనాల నిర్మాణంపై అనిశ్చితి నెలకొంది.




పీలేరులో ప్రస్తుతం ఉన్న కోర్టు భవనం, కొత్త భవనాలు నిర్మించనున్న చెన్నకేశవ స్వామి ఆలయ భూములు

ఎమ్మెల్యే, బార్ అసోసియేషన్ కృషితో కదలిక

2024 ఎన్నికల సమయంలో స్థానిక న్యాయవాదులు నూతన భవనాల అంశం నల్లారి కిశోర్ కుమార్ రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. తమ ప్రభుత్వం కొలువు దీరిన వెంటనే అందుకు సంబంధించిన చర్యలు చేపడతామని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఆ మేరకు కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బీసీ పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్ తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వారికి ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సహకారం లభించి నూతన భవనాల అంశం ప్రభుత్వ పెద్దలు దృష్టికి తీసుకెళ్లారు. వారి కృషి ఫలించి ప్రభుత్వం పీలేరులో నాలుగు కోర్టుల సముదాయాల నిర్మాణానికి రూ.23.70 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఈ సందర్భంగా శనివారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కోర్టుల సముదాయం కోసం రూ.31 కోట్లు అవసరమని ఆర్అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపారని, తొలి విడతగా ప్రభుత్వం రూ.23.70 కోట్లకు అంగీకరించిందని, మిగిలిన నిధులను కూడా సాధిస్తామన్నారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ నిధుల మంజూరు ఇక కేవలం లాంఛనమేనని, త్వరలోనే నిర్మాణ పనులు కార్యరూపం దాల్చుతాయని తెలిపారు. కోర్టుల భవనాలకు నిధుల మంజూరు నేపథ్యంలో కూటమి ప్రభుత్వంలో పీలేరుకు అంతా మంచే జరుగుతోందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. మొన్న పీలేరును గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మార్చేందుకు అంగీకారం, నిన్న రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటన, నేడు పీలేరులోని కోర్టులకు నూతన భవనాల నిర్మాణానికి నిధుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్‌తో ఇక పీలేరు అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పోలి చెరువు వద్ద చమర్తి జలహారతి



జలహారతి ఇస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటలో అతి పెద్దచెరువు పోలి చెరువు పూర్తిగా నిండడంతో టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్ మోహన్‌రాజు శనివారం జలహారతి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో ప్రస్తుత వర్షాల వల్ల అన్ని చెరువులు నిండడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు నాగేశ్వర్‌నాయుడు, మార్కెట్‌యార్డు ఛైర్మన్ గన్నే సుబ్బనరసయ్యనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రవికుమార్‌నాయుడు, పట్టణ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై మచ్చుకత్తితో దాడి



గాయపడిన గంగరాజు

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తన భార్యతో మాట్లాడుతున్నాడనే అనుమానంతో ఓ వ్యక్తి మచ్చుకత్తితో దాడి చేసి గాయపరిచాడని ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. ఆయన కథనం మేరకు గంగరాజు అనే వ్యక్తి ప్రతిరోజూ తన చెల్లెలి పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకొచ్చి వదిలేవాడు. శనివారం యథావిధిగా అక్కడికి వచ్చిన గంగరాజును అంగన్‌వాడీ కేంద్రం పక్కనే ఉన్న ఇంట్లో అద్దెకు నివసిస్తున్న సురేశ్ సెల్‌ఫోన్ ఇమ్మని అడిగాడు. అందుకు అతను తిరస్కరించడంతో ఇద్దరూ గొడవపడ్డారు. తన భార్యతో రోజూ మాట్లాడుతున్నావని ఆరోపిస్తూ మచ్చుకత్తితో సురేశ్ దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన గంగరాజును చుట్టుపక్కలవారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. సురేశ్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

నిందితులపై కేసు నమోదు



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న లారీ డ్రైవర్స్ అసోసియేషన్ నేతలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్‌పై దాడి చేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు తమిళనాడు రాష్ట్రం గుడియాతానికి చెందిన లారీ డ్రైవర్ సయ్యద్ అంజాద్ ఝూర్ఖండ్ నుంచి మదనపల్లె మార్కెట్ యార్డుకు సరుకు లోడును గురువారం రాత్రి తీసుకొచ్చారు. మదనపల్లెకు చెందిన పీఎం ట్రేడర్స్ మసూద్ కిరాయి ఇవ్వక పోవడంతో కిరాయి కోసం నిలదీశాడు. దీంతో మండి యాజమాని, మరో ఐదుగురు లారీ డ్రైవర్‌పై దాడి చేసి గాయపరిచారు. స్థానికులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు లారీ డ్రైవర్స్ అసోసియేషన్ నేతలతో కలిసి 50 మందికిపైగా శనివారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. వీరంతా గుమికూడి ఉండగా టూటౌన్ సీఐ రాజారెడ్డి రాష్ట్రీయ చాలక్ ఏకతా మట్ లారీ వర్కర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సర్దార్ హుసేన్‌ను కొట్టి లాక్కుపోయి లోపల కూర్చోబెట్టాడు. దీంతో అసోసియేషన్ ఛైర్మన్ అబూబ్‌షేక్ ఆధ్వర్యంలో సీఐ రాజారెడ్డిపై మదనపల్లె డీఎస్పీ మహేంద్రకు, ఎస్పీ ధీరజ్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు అసోసియేషన్ నేతలు తెలిపారు. కాగా డ్రైవర్‌పై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.

పాత కక్షలతో ఆటో దహనం



మంటల్లో కాలిపోయిన ఆటో

వాల్మీకిపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో ఇరువర్గాలు ఘర్షణ పడి ఆటో దహనం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరు వ్యక్తులు తమకు ఉన్న పాత కక్షల నేపథ్యంలో గాంధీ బస్టాండ్ ప్రాంతంలో ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. ఓ వర్గానికి చెందిన వ్యక్తి ఆటోకు మరొకరు నిప్పు పెట్టారు. ఆటో తగలబడిపోతుండడంతో స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. బస్టాండ్ ప్రాంతంలో ఘర్షణ వాతావరణం చోటు చేసుకోవడం ఎస్ఐ చంద్రశేఖర్ సిబ్బందితో వెళ్లి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇరువర్గీయులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణంలో చోరీ

కురబలకోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంగళ్లులో శుక్రవారం రాత్రి అంగళ్లులోని కదిరి రోడ్డులో మద్యం దుకాణంలో చోరీ జరిగింది. రూ.45 వేల నగదు, మద్యం బాటిళ్లను దొంగిలించుకెళ్లారు. షాపుపై ఉన్న రేకులను కట్ చేసి షాపులోకి ప్రవేశించి చోరీ చేశారు. శనివారం ఉదయం షాపులో చోరీకి గురైన విషయాన్ని దుకాణదారులు చూసి యజమానికి తెలియజేశారు. దీంతో దుకాణయజమాని రుద్ర బాలకృష్ణ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు విచారించారు. ఒక షాపులో చోరీకి పాల్పడిన సంఘటన సీసీ కెమెరాలో నమోదైంది. కాగా ఒక యువకుడు చోరీ చేసినట్లు తెలుస్తోంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య



కీర్తిరెడ్డి మృతదేహం

రాజంపేట టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ చదువుతున్న కనపర్తి కీర్తిరెడ్డి (21)అనే యువతి శనివారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మన్నూరు పోలీసులు అందించిన సమాచారం ప్రకారం... నందలూరు గ్రామానికి చెందిన కీర్తిరెడ్డి తండ్రి ఉపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లగా, ఆమె తల్లి అన్నమాచార్య యూనివర్సిటీకి సమీపంలోని బోయనపల్లెలో నివాసముంటూ కూతురిని చదివించుకుంటోంది. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం బెడ్ రూంలోకి వెళ్లిన కీర్తి రెడ్డి ఎంతసేపటికీ తలుపులు తెరవకపోవడంతో అనుమానించిన తల్లి తలుపులు తెరవగా కూతురు ఫ్యానుకు వేలాడుతూ కనిపించింది. స్థానికుల సాయంతో ఆమెను కిందకు దించి రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆమె మృతికి కారణాలు తెలియరాలేదని, కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పట్టపగలే వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

కలికిరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాయమాటలు చెబుతూ వృద్ధురాలు చదివే అరుణకుమారి మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కుపోయిన సంఘటన శనివారం కలికిరిలో జరిగింది. పట్టణంలోని చదివేవాండ్లపల్లెలో పీలేరు రోడ్డులో చదివే నరసింహారెడ్డి భార్య అరుణకుమారి ఒంటరిగా నివసిస్తోంది. పిల్లలు బయట ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి అరుణకుమారి ఇంటి వద్దకు వచ్చి ఇల్లు బాడుగకు ఇస్తావా అని అడిగాడు. అలా అడుగుతూనే ఇంటి లోపలికి దూసుకెళ్లి అరుణకుమారి మెడలోని బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. దొంగిలించిన గొలుసు బరువు 36 గ్రాములుగా పేర్కొంటూ ఈ మేరకు అరుణకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన సీఐ రామచంద్ర, ఎస్ఐ రమణ పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. అనుమానితుడి ఫొటోలు లభ్యమైనట్లు సమాచారం.

బస్సు నుంచి పడి మహిళకు గాయాలు



గాయపడ్డ భాగ్యమ్మ

ములకలచెరువు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు నుంచి పడి మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీసుల కథనం మేరకు... ములకలచెరువు వాసి భాగ్యమ్మ పనుల నిమిత్తం సత్యసాయి జిల్లా నల్లచెరువుకు వెళ్లేందుకు బస్టాండు సర్కిల్‌కు వచ్చింది. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సు రావడంతో ఎక్కుతుండగా డ్రైవర్ ముందుకు కదిలించాడు. దీంతో మహిళ కిందపడి తీవ్రంగా గాయపడింది. మహిళ కిందపడిపోయినా డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించి వెళ్లిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడే ఉన్న ఆటోడ్రైవర్లు మహిళను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో 108 అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సు ముందు మహిళల నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించే ప్రభుత్వం సరిహద్దు గ్రామాలకు పథకం వర్తింపజేయడం లేదని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. కొద్ది రోజులుగా మండలంలోని కర్ణాటక సరిహద్దు గ్రామాలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం నిలిపేయడంతో మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం బి.కొత్తకోట నుంచి చేలూరుకు వయా కందుకూరు, కమ్మచెరువు మీదుగా చేలూరుకు వెళ్లే పలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం నిలిపేశారని పలువురు కందుకూరు మహిళలు కందుకూరులో ఆర్టీసీ బస్సును నిలిపి నిరసన వ్యక్తం చేశారు. మహిళలు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం లేకపోవడంతో సరిహద్దు గ్రామాల్లో ఉన్న మాకు తీవ్ర నష్టం జరుగుతోందని, సంబంధిత అధికారులు స్పందించి సరిహద్దు గ్రామాలకు ఉచిత ప్రయాణాన్ని కొనసాగించి మాకు న్యాయం చేయాలని మహిళలు కోరుతున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి(నేతాజీ సర్కిల్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని వైద్య ఆరోగ్య శాఖకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో అందించే వైద్య సేవలు, ఐఎంఆర్, ఎంఎంఆర్ ప్రమాణాలు, వివిధ రకాల వైద్య పరీక్షలు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాలలో నిర్వహించే రక్త పరీక్షల్లో కొన్ని ఆరోగ్య కేంద్రాల్లో గర్భవతుల హిమోగ్లోబిన్ శాతం తక్కువగా నమోదు అవుతోందని, దీనిపై ఆరోగ్య అధికారులు దృష్టి సారించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలతో సమన్వయం చేసుకుని నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. కొన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఐఎంఆర్, ఎంఎంఆర్‌లు నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవడం లేదని, సంబంధిత ఆరోగ్య శాఖ అధికారులు, ఏఎన్ఎంలు దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఇటీవల జరిగిన మరణాలపై సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలు, గురుకులాలు, కస్తూరి బా పాఠశాలల్లో ఆరోగ్య శాఖ అధికారులు, ఏఎన్ఎంలు తరచుగా పరీక్షలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

- ఏడీఏ రమణారావు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ రమణారావు

బి.కొత్తకోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, క్రిమి సంహారక మందులను అధిక ధరలకు అమ్మినట్లు రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ పీలేరు ఏడీఏ రమణారావు దుకాణదారులను హెచ్చరించారు. సామాజిక తనిఖీల్లో భాగంగా శనివారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేపట్టిన ఆయన మాట్లాడుతూ నిషేధిత మందులు, ఎరువులు ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించరాదన్నారు.

ప్రతి దుకాణంలోనూ అమ్మకాలు, కొనుగోళ్లు, ప్రస్తుతం ఆయా దుకాణాల్లో ఎరువులు, క్రిమిసంహారక మందుల నిల్వల వివరాలు రికార్డులు, బోర్డుల్లో కనపరచాలని, విక్రయించిన మందులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. వ్యాపారులు మోసం చేస్తే ఆధారాలతో తమకు ఫిర్యాదు చేయాలని రైతులకు తెలిపారు. రైతన్నా..మీ కోసం ద్వారా రైతులు అవగాహన పొంది, ఆరుతడి పంటలు, ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని సూచించారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడి సస్పెన్షన్



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గాలివీడు, డిసెంబరు 6(ఆంధ్ర జ్యోతి): తూముకుంట పంచాయతీ కస్బాలో మసీదు నిధులను కాజేసిన తూముకుంట ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎం.పాపాసాహెబ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఆయన విలేఖరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మసీదు అభివృద్ధి కోసం వక్ఫ్ బోర్డు నుంచి విడుదలైన రూ.12 లక్షలు, దాతల నుంచి సేకరించిన మరికొంత సొమ్మును తన స్వంతానికి వాడుకున్నాడని గ్రామ ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామంలో విచారణ చేశామన్నారు. విచారణలో మసీదు నిధులు వాడుకున్నాడని నిర్ధారణ జరిగిందని, వాటిని తిరిగి చెల్లించమని రెండుసార్లు హెచ్చరించినా ఆయన పట్టించుకోలేదన్నారు. ప్రజలకు, పార్టీకి చెడ్డ పేరు తెస్తున్న విషయం అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లామని, వారి ఆదేశాల మేరకు ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు మహమ్మద్ రియాజ్, శ్రీనివాస రాజు, భద్రత నాయుడు, వక్ఫ్ బోర్డు మాజీ సభ్యులు మహబూబ్ బాషా, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పీలేరులో అట్టహాసంగా ఐక్యతా ర్యాలీ



యూనిటీ మార్చ్‌లో అధికారులు

పీలేరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా శనివారం పీలేరులో యూనిటీ మార్చ్ (ఐక్యతా ర్యాలీ) అట్టహాసంగా జరిగింది. కడప జిల్లా యువజన అధికారి ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ దేశ ప్రథమ హోం మంత్రిగా పనిచేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశంలోని సంస్థానాలన్నింటినీ ఐక్యం చేసి దేశ సమగ్రతను కాపాడారన్నారు. ఆయన జీవితం, ఆశయాల గురించి యువతకు తెలియజేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆయన జయంతిని దేశవ్యాప్తంగా నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా రాయచోటి, పీలేరు పట్టణాల్లో ఐక్యతా ర్యాలీ నిర్వహించామన్నారు. పీలేరు పంచాయతీ కార్యాలయంలో ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివశంకర్, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు చంద్రశేఖర రెడ్డి, ఈఓ బ్రహ్మానంద రెడ్డి, బీజేపీ నేతలు వెంకటరమణ, పురుషోత్తం, స్థానిక నిర్వాహకులు పీవీఎస్ లక్ష్మి, రాయల సుధాకర్, జాతీయ యువ కార్యకర్తలు వెంకటేశ్, నాగరాజు, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో ఉద్యమం ఉధృతం

- విద్యార్థుల భారీ ర్యాలీ.. పెన్షనర్ల ఆందోళన



రాజంపేటలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

రాజంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ చేస్తున్న ఆందోళన రోజురోజుకు ఉధృతమవుతోంది. శనివారం రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ అనంతరం పాతబస్టాండులో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ జనసేన నాయకుడు యల్లటూరు శ్రీనివాసరాజు, బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు షబ్బీర్‌అహ్మద్, మైనార్టీ నాయకులు అబూబకర్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు సమ్మెట శివప్రసాద్ తదితరులు మాట్లాడుతూ రాజంపేటను జిల్లా చేసేంతవరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తూనే ఉంటామని హెచ్చరించారు.



రాజంపేటలో ఆందోళన చేస్తున్న పెన్షనర్లు

పెన్షనర్ల నిరసన ప్రదర్శన

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలంటూ స్థానిక ఎన్జీవో భవనం సమీపంలో పెన్షనర్లు ఆందోళన చేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పిల్లి పిచ్చయ్య, కేడీ వరప్రసాద్, జేఏసీ నాయకులు వర్దిబోయిన సుధాకర్‌బాబు, నీలి ఈశ్వరయ్య, చిట్వేలి రవికుమార్, హరీష్, అలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు, జేఏసీ నాయకుడు అబ్బూరు ప్రభాకర్‌నాయుడు, అల్లం సుబ్రమణ్యం మాట్లాడుతూ రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో విద్యార్థులు, మైనార్టీలు, అన్నివర్గాల ప్రజలు ఉద్యమంలో పాల్గొంటున్నారని వారి ఆకాంక్షలకు అనుగుణంగా రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని డిమాండ్ చేశారు.

రిలేదీక్షలు

రాజంపేట ఆర్అండ్‌బీ బంగ్లా ఎదుట మున్సిపల్ వైస్‌ఛైర్మన్ మర్రి రవి ఆధ్వర్యంలో రిలే దీక్షలు ప్రారంభించారు. జిల్లా కేంద్రం ప్రకటించేవరకు ఆమరణదీక్ష చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కువైట్‌లో ఎన్ఆర్ఐల నిరసన

కువైట్‌లో ఎన్ఆర్ఐలు నిరసన ప్రదర్శన చేశారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని నినాదాలు చేశారు. ఈ మేరకు కువైట్‌లోని భారతీయ రాయబార కార్యాలయంలో వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

ప్రత్యామ్నాయంపై మక్కువ..

● కొత్త పంటల వైపు రైతుల చూపు ● విస్తరిస్తున్న డ్రాగన్ ఫ్రూట్స్, ఆయిల్‌పామ్, వెదురు, అవకాడో

ఓబులవారిపల్లె, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో వ్యవసాయమే జీవనాధారంగా రైతులు జీవనం సాగిస్తున్నారు. మామిడి, అరటి, బొప్పాయ పంటలతో పచ్చగా కళకళలాడుతూ ఉన్న ఈ నియోజకవర్గాన్ని రెండో కోనసీమగా అభివర్ణిస్తారు. భూగర్భజలాలు అంతంత మాత్రమే అయినా.. గల్ఫ్‌దేశాలకు వెళ్లి సంపాదించుకున్న రూపాయలను ఖర్చు పెట్టి ఉన్న భూములను సాగులోకి తీసుకువస్తుంటారు. ప్రస్తుతం వాణిజ్య పంటలకు అంత డిమాండ్ లేకపోవడంతో ఉన్న పంటలకు మంగళహారతి పట్టేందుకు రైతులు సిద్ధపడుతున్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని ఉద్యాన అధికారులు చెబుతున్నారు. వీటిల్లో ముఖ్యంగా డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, ఆయిల్‌పామ్, వెదురు తోటలను సాగు చేయడానికి ముందుకు వస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సబ్సిడీతో ప్రోత్సహించడంతో వీటి విస్తీర్ణం యేటా పెరుగుతోంది. అంతేకాకుండా ఉపాధి హామీ పథకంలో నూతన పంటలకు ప్రోత్సాహకాలిస్తుండటంతో రైతులు మరింత ఆసక్తి చూపుతున్నారు.


ఓబులవారిపల్లె మండలంలో సాగులో ఉన్న డ్రాగన్‌ఫ్రూట్

డ్రాగన్‌ఫ్రూట్

డ్రాగన్‌ఫ్రూట్ సాగు ప్రస్తుతం మంచి డిమాండ్ ఉన్న పంటగా చెబుతున్నారు. ఒకటిన్నర మీటర్ల దూరం స్తంభాలు, ట్రెల్లీస్ పద్ధతిలో సాగు చేయవచ్చు. ఇది ఉష్ణ మండలాల పండు. మూడో సంవత్సరం నుంచి దిగుబడి వస్తుంది. డ్రాగ న్ పువ్వు వచ్చిన 25 నుంచి 30 రోజుల్లో పండుగా మారుతుంది. ఇందులో మంచి పోషకాలు, విటమిన్‌లు, ఖనిజాలు ఉంటాయని వైద్యులు సైతం సూచించారు. ఇది సుమారు వందలాది ఎకరాల్లో సాగులోకి వస్తున్నది.


బొజ్జావారిపల్లె పంచాయతీలో అవకాడో పంటను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారితో రైతు

ఆయిల్‌పామ్

ఈ పంట సాగు సుమారు వందల ఎకరాల్లో నమోదవుతున్నది. యేటా సాగును పెంచడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీర్ఘకాలికంగా మంచి ఆదాయాన్ని ఇచ్చే పంటగా చెబుతున్నారు. వరి, పత్తి పంటల కంటే తక్కువ ఖర్చు, ఎక్కువ ఆదాయం. ఇది 20మీటర్ల ఎత్తు వరకు పెరుగుతుంది. ఆయిల్‌పామ్ సాగును మే, జూన్ నెలల్లో ప్రారంభిస్తారు. ఎటు చూసినా మొక్కకు మొక్కకు 9 మీటర్ల దూరంతో నాటుకోవాలి. హెక్టారుకు 140 మొక్కల వరకు పెంచుకోవచ్చు. మూడు సంవత్సరాల వరకు మొక్కకు నీరు ఎక్కువగా పెట్టాలి. రెండున్నర నుంచి మూడు సంవత్సరాల లోపు దిగుబడి మొదలవుతుంది. ఇది 30 నుంచి 40 సంవత్సరాల వరకు దీర్ఘకాలిక ఆదాయాన్నిచ్చే పంటగా అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రైతులు మామిడి పంటను తీసివేసి ఆయిల్ పామ్ సాగుకు సిద్ధమవుతున్నారు.


బొమ్మవరంలో సాగులో ఉన్న వెదురు పంట

వెదురు

ఈ వెదురు పంటను ఆకుపచ్చ బంగారంగా అభివృద్ధి చేస్తారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ మిషన్ ప్రాజెక్టు కింద ప్రత్యేకంగా వెదురు సాగును ప్రోత్సహిస్తూ రాయితీలు అందిస్తున్నారు. బీడు భూముల్లో వెదురు సాగు చేస్తే మంచి ఆదాయం ఇచ్చే అవకాశం ఉంటుందని గ్రామీణ పేదలను ప్రోత్సహిస్తున్నారు. భవిష్యత్‌లో మంచి ఆదాయం వస్తుందని, డ్వాక్రా సంఘాల మహిళలను కూడా ప్రోత్సహించి సాగు చేపడుతున్నారు. వీటి సాగు విధానం 60 సెం.మీ గుంతల్లో నాటుకోవాలి. హెక్టారుకు 400 మొక్కల వరకు ఎటు చూసినా మొక్కకు మొక్కకు 5 మీటర్ల దూరంలో నాటుకోవాలని తెలిపారు. ఇవి మూడు సంవత్సరాల తర్వాత నుంచి దిగుబడి మొదలవుతుంది.

అవకాడో

ఈ పంట సాగుకు నియోజకవర్గ పరిధిలో అనుకూలమైన నేలలు ఉండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. వెచ్చని తేమ, అధిక ఎండ ఉన్న నేలలు అవకాడో సాగుకు అనుకూలంగా ఉంటాయని ఉద్యాన అధికారులు తెలిపారు. ఎకరాకు 160-170 వరకు మొక్కలు పెంచుకోవచ్చు. విత్తనాల ద్వారా సాగు చేస్తే 10 సంవత్సరాలకు దిగుబడి వస్తుంది. అదే అంటు మొక్కల ద్వారా అయితే 3-4 సంవత్సరాల్లో దిగుబడి మొదలవుతుంది. ఇది ప్రస్తుతం మంచి రేటు ఉన్న పంట.

మక్కువ చూపుతున్న రైతులు..



నియోజకవర్గంలోని రైతులు సంప్రదాయ పంటలపై మక్కువ చూపుతున్నారు. నూతనంగా పరిచయమైన డ్రాగన్‌ఫ్రూట్‌ను వందలాది ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అలాగే ఆయిల్‌పామ్, అవకాడో వంటి నూతన పంటలు సాగు చేసేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. అందుకు తగ్గట్టు తాము కూడా ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, సాగు విధానాల గురించి రైతులకు వివరిస్తున్నాం.

- భాస్కర్, ఉద్యానశాఖాధికారి

ఏ పంట వేసినా నష్టపోయా..



ప్రతి యేటా ఎన్నో ఆశలు పెట్టుకొని పంటలు పండిస్తే చివరికి నష్టాలే మిగులుతున్నాయి. కొంతమంది సలహాలు, ప్రత్యామ్నాయ పంటలపై సామాజిక మాధ్యమాల్లో చూసి అధికారుల సలహాలతో ఆయిల్‌పామ్ సాగును అరటిలో చేపట్టాం. ప్రస్తుతం ఉన్న మామిడి చెట్లను తీసివేసి కొత్త పంటలు సాగు చేస్తున్నారు. తాను కూడా కొత్త ప్రయత్నం చేస్తున్నాను.

- శంకర్‌రెడ్డి, ఆయిల్‌ఫామ్ రైతు

ఎమ్మార్పీకే ఎరువులు అమ్మాలి : ఏడీఏ

కలకడ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎమ్మార్పీ ధరలకే ఎరువులు అమ్మాలని రాయచోటి వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీలత ఎరువుల దుకాణాల యాజమానులకు సూచించారు. శనివారం ఆమె కలకడలోని టీ.ఎస్. మస్తాన్ ఫర్టిలైజర్, జువారి ఫామ్ హబ్, కోరమాండల్ ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. రికార్డులు, స్టాక్‌ను పరిశీలించి ఆయా లెక్కల్లో నమోదు చేయని రూ. 39,152 వేలు విలువగల 107కిలోల డ్రిప్ తదితర ఎరువుల అమ్మకాలు చేయరాదని ఆదేశించారు. ప్రభుత్వ అనుమతి పొందిన సరుకును మాత్రమే విక్రయించి, ప్రతి కొనుగోలుదారుకు బిల్లులు ఇవ్వాలని లేని యెడల చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తనిఖీల్లో ఏఓ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపు ప్రారంభం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంకిశెట్టిపల్లెలో స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లచే ప్రోగ్రాం ఆఫీసర్ రెడ్డెప్పరెడ్డి ఆధ్వర్యంలో శనివారం స్పెషల్ క్యాంపు ప్రారంభించారు. ప్రిన్సిపాల్ గోపతి బాలకృష్ణమూర్తి, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించారు. క్లీన్ అండ్ గ్రీన్ గ్రామసచివాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

అభ్యంతరాలను 30లోగా తెలపాలి

● డీఎంహెచ్‌వో నాగరాజు

కడప కలెక్టరేట్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ల మెరిట్ జాబితా అధికారిక వెబ్‌సైట్‌లో ఉందని, అభ్యంతరాలు ఉంటే తెలపాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోని జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితా kadapa.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉందని, అభ్యంతరాలుంటే ఈనెల 30వ తేదీలోగా డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో సాయంత్రం 5గంటల లోపు ఆధారాలతో ఫిర్యాదు చేయాలని ఆ ప్రకటనలో తెలిపారు.

క్వాంటమ్ కోర్ కాన్సెప్ట్‌పై అవగాహన

వేంపల్లె, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో నాలుగు రోజులుగా జరుగుతున్న క్వాంటమ్ శిక్షణ సమావేశంలో శనివారం క్వాంటమ్ కంప్యూటింగ్ కాన్సెప్ట్‌పై అవగాహన కల్పించారు. హైదరాబాద్‌కు చెందిన సీడాక్ కంపెనీ ప్రతినిధి అభిజిత్ తేజ్ విద్యార్థులకు క్వాంటమ్ కంప్యూటింగ్ వివరాలు తెలిపారు. గ్రోవర్ ఆల్గరిథమ్, డయాస్ ఆల్గరిథమ్, క్వాంటమ్ సర్క్యూట్ తయారీపై వివరించారు. ఈ సందర్భంగా అభిజిత్ తేజ్‌ను డైరెక్టర్ గుప్తా, ఏవో రవికుమార్ ఇతర అధికారులు సత్కరించారు.

అధికార లాంఛనాలతో డీఎస్పీ అంత్యక్రియలు

కలసపాడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అధికార లాంఛనాలతో శనివారం 11వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ (డీఎస్పీ) కందుల వెంకటరెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. శుక్రవారం అనారోగ్యంతో ఆయన మృతి చెందిన విషయం తెలిసిందే. స్వగ్రామమైన అక్కివారిపల్లెలో శనివారం సాయంత్రం పోలీసుల లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు. కార్యక్రమంలో ఎస్సీఎస్టీ సెల్ అడిషనల్ కమాండెంట్ కె.సాంబయ్య, 11వ బెటాలియన్ కమాండెంట్ పీఎన్‌డీ ప్రసాద్, ఆర్ఐ కె.నాగరాజు, ఆర్ఎస్ఐ డీవీ సుబ్బారావు, ఏఆర్ఎస్ఐ టీఈ రమణ, పోరుమామిళ్ల ఎస్ఐ కొండారెడ్డి, కలసపాడు పోలీసులు పాల్గొన్నారు.

నీటికుంటలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

కడప క్రైం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కడప నగరం రిమ్స్ సమీపంలో మానసిక పరిస్థితి సరిగాలేని వ్యక్తి నీటికుంటలో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు... ప్రొద్దుటూరు పట్టణం కల్లూరు గ్రామానికి చెందిన సుమంత్(29) మతిస్థిమితం(మానసికపరిస్థితి) సరిగ్గా లేకపోవడంతో వైద్య పరీక్షల నిమిత్తం కడప రిమ్స్‌కు తీసుకొచ్చారు. అదేరోజు హాస్పిటల్ నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. శనివారం రిమ్స్ సమీపంలో సుమంత్ మృతదేహాన్ని గుర్తించామని, మృతుడి భార్య సుష్మిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. స్వామి వారి జన్మనక్షత్రం ఆరుద్రకు శివపార్వతుల కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. శనివారం సాయంత్రం ఆలయంలో స్వామి వారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి స్వామి వారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి ఉభయదారులుగా బి.కొత్తకోట వాసులు నంబూరి అక్కులప్ప శెట్టి కుమారులు వెంకటేష్, రామకుమార్ కుటుంబ సభ్యుల చేతుల మీదుగా నిర్వహించారు.


శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

ఆదివాసుల అభ్యున్నతికి కృషి చేయాలి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆదివాసులు అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు బొజ్జప్ప డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆదివాసుల సంక్షేమ సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 44 మండలాల్లో మాత్రమే ఆదివాసులకు రిజర్వేషన్ కల్పించి మిగిలిన 635 మండలాల్లోని మైదాన ప్రాంతాల్లో నివసించే ఆదివాసులు రిజర్వేషన్ కల్పించలేదన్నారు. విద్య, ఉద్యోగ, సామాజిక, రాజకీయ పరంగా రిజర్వేషన్‌తో గిరిజనుల అభ్యున్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గిరిజన నాయకులు వేమనారాయణ, శ్రీరాములు, రామచంద్ర, ఈశ్వరయ్య, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండకు రూ.17.57 లక్షల ఆదాయం

తంబళ్లపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ ఆలయానికి సంబంధించిన వివిధ పనులకు ఏడాది పాటు హక్కులను పొందడానికి నిర్వహించిన బహిరంగ వేలం పాటల ద్వారా రూ.17,57,500 ఆదాయం వచ్చినట్లు ఈవో మునిరాజ తెలిపారు. శనివారం మల్లయ్యకొండ పైన ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి, ఈవో, జూనియర్ అసిస్టెంట్ రవికుమార్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. వేలంలో ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఆశావాహులు పాల్గొన్నారు. ఆలయం వద్ద కొబ్బరి చిప్పలు, గౌరమ్మ కుప్ప, ఏనుగు మల్లమ్మ ఆలయం వద్ద పూజా సామాగ్రి విక్రయించే హక్కు, దుకాణాలకు గేటు వసూలు, లడ్డూ ప్రసాదం, తలనీలాలకు సంబంధించి వేలం నిర్వహించారు. కాగా పాదరక్షలు భద్రపరచు హక్కు (ఫిబ్రవరి 14, 15, 16 తేదీలు మాత్రమే)ను పొందడానికి ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో వాయిదా పడింది. అలాగే వాహనాల టోల్ గేటు హక్కుకు వేలం నిర్వహించడానికి అటవీ శాఖ నుంచి అభ్యంతరం రావడంతో తాత్కాలికంగా వాయిదా వేయినట్లు ఈవో తెలిపారు. అటవీ శాఖ ఉన్నతాధికారులతో సంప్రదించిన అనంతరం టోల్‌గేట్‌కు వేలం నిర్వహిస్తామని ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ రికార్డు అసిస్టెంట్ కొండకిట్ట, ఈశ్వర, టీడీపీ నాయకులు రెడ్డెప్పరెడ్డి, డేరంగుల చంద్ర, కృష్ణమూర్తినాయుడు, ఉత్తమ్‌రెడ్డి, బేరిశీన, పురుషోత్తం, సుధాకర్‌రెడ్డి వీరాంజినేయులు, మ్యూజికల్ శివ, మణి, సోము, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు. వేలం వద్ద గొడవలు జరుగుతాయని సమాచారం ఉండటంతో తంబళ్లపల్లె, పెద్దమండ్యం ఎస్ఐలు ఉమామహేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు వేలం వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.


బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



పెద్దమండ్యంలో డంపింగ్‌యార్డ్‌ను తనిఖీ చేసిన డీడీవో అమరనాథరెడ్డి

పెద్దమండ్యం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు కృషి చేయాలని డివిజన్ అభివృద్ధికారి అధికారి (డీడీఓ) అమరనాథ్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలో శనివారం పర్యటించిన ఆయన చెత్త సేకరణపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పురవీధుల్లో పారిశుధ్య పనులు, చెత్త నుంచి సంపద తయారు కేంద్రం (బృందావనం) తనిఖీ చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారు. గ్రామాల్లో పనులపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో బృందావనాలు వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఎంపీడీఓ శ్రీధర్‌రావు, డిప్యూటీ ఎంపీడీవో విమలకుమారి, ఎంపీఓ సురేంద్రరెడ్డి, కార్యదర్శులు జనార్ధన, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సీటీఎం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

మదనపల్లె అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సీటీఎం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రోగుల రిజిస్ట్రేషన్, మందుల లభ్యత, ల్యాబ్ పరీక్షల నిర్వహణ, శానిటేషన్ వంటి అనేక అంశాలను పరిశీలించి సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామ ప్రజల్లో జ్వరం, దగ్గు, తలనొప్పి, నీరసం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే పరీక్షలకు తీసుకురావాలన్నారు. ఓపీ, ఐపీ రోగులను శ్రద్ధగా పరీక్షించి, అవసరమైన మందులు సమయానికి అందివ్వాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కృపాలత, వైద్యసిబ్బంది రామచంద్ర, ప్రభాకర్, రమాదేవి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


సీటీఎం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంఅండ్ హెచ్‌వో లక్ష్మీనరసయ్య

ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుంది : మంత్రి

పెద్దమండ్యం, డిశంబరు 6(ఆంధ్రజ్యోతి) టీడీపీ ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పెద్దమండ్యంలో శనివారం మంత్రి పర్యటించారు. మంత్రికి ఘన స్వాగతం లభించింది. పెద్దమండ్యం లోని టీడీపీ నేత వంటమాస్టర్ హరి నివాసం టీడీపీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. మంత్రికి వారు ఘనంగా సన్మానించారు. స్థానిక ఎన్నికల్లో కలిసి విజయం సాధించాలన్నారు. జిల్లా, మండల సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కూటమి నేతలు మండల తెలుగు యువత అధ్యక్షుడు నారా గంగాధర, రామాంజులు, లక్ష్మీనారాయణ, ఫరూక్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


పెద్దమండ్యంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి సన్మాన దృశ్యం

జయహో... హక్కుల భాస్కరా

వాడవాడలా అంబేడ్కర్ వర్ధంతి ● అధికారులు, ప్రజాప్రతినిధుల నివాళులు



పీలేరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ శ్రేణులు

పీలేరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి, దళిత జన బాంధవుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి పీలేరు, కేవీపల్లె మండలాల్లో జరిగాయి. పీలేరు మండలంలోని వివిధ ప్రజా, దళిత, విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్దనున్న ఆయన విగ్రహానికి పెద్దఎత్తున పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేవీపల్లె మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరించి పూలమాలలు సమర్పించారు. పలువురు నేతలు మాట్లాడుతూ తరతరాలుగా అణిచివేతకు గురైన బడుగు, బలహీన, దళిత వర్గాలకు రాజ్యాంగంలో హక్కులు కల్పించి వారి జీవితాల్లో నూతన వెలుగులు ప్రసాదించారని కొనియాడారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో కేవీపల్లె ఎంపీడీఓ సుధాకర్, ఆర్ఐ రమణ, మాలమహానాడు, ఎంఎస్‌పీ, వీహెచ్‌పీఎస్, ఎంఆర్‌పీఎస్, ఎంఆర్‌పీఎఫ్, బీసీ, సీపీఐ, మాదిగ దళ పోరాట సమితి(ఎండీపీఎస్) నేతలు తుమ్మల ధరణీ కుమార్, నగరిమడుగు సుభాష్, జెట్టి మల్లికార్జున, గండికోట వెంకటేశ్, హరినాథ్, రాము, రెడ్డికుమార్, బాలసుబ్రహ్మణ్యం, వెంకటరమణ, వెంకటేశ్, సుబహాన్, నరసింహ, రాము, రాజా, వెంకటరమణ, చిన్నబాబు, టీఎల్ వెంకటేశ్, నరసింహులు, పీవీ రమణ, బేబీ, దాము, మురళి, ముల్లంగి చంద్రయ్య, శ్రీనివాసులు, అశోక్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

టి.రాచపల్లెలో అంబేడ్కర్ వర్ధంతి

గుర్రంకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వర్ధంతిని టి.రాచపల్లెలో నిర్వహించారు. గ్రామంలోని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, నేతలు భాస్కర్‌రెడ్డి, సురేంద్ర, చిన్ని, రవణమ్మ, గుంగులు, ఆంజి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో...

వాల్మీకిపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి చేసుకున్నారు. దళిత సంఘాలు, ప్రజా సంఘాలు, వివిధ పార్టీల నేతలు, యువత పాత బస్‌స్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంతో నడుచుకోవాలన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో నివాళులు



కలికిరిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాల మహానాడు నేతలు

కలికిరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. ఎంపీడీఓ భానుమూర్తి రావు, డిప్యూటీ ఎంపీడీఓ రియాజుద్దీన్, ఏఓ సురేంద్రబాబు ఆధ్వర్యంలో మండల పరిషత్తు అధికారులు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి హరి, మండల మాల మహానాడు అధ్యక్షుడు సతీష్, ఎన్టీ రమణ, గీతాంజలి, గిరి, హరి, సురేష్, జవహర్, అంకయ్య, విశ్వనాథ, రత్నమ్మ, చంద్ర, పాలేటి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి బస్‌స్టాండ్‌లో....

నిమ్మనపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ప్రజా సేవ సంస్థ అధ్యక్షుడు సహదేవ, మాల మహానాడు మండల అధ్యక్షుడు వీరనాల మాణిక్య పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బస్‌స్టాండులోని విగ్రహానికి నివాళులర్పించారు. భారత రాజ్యాగాన్ని రాసిన మహనీయుడు అంబేడ్కర్ అని అయన జీవిత చరిత్ర తెలుసుకోవడం అందరి బాధ్యత అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, ముబారక్, యర్రయ్య, సోమశేఖర్, లక్ష్మన్న, జయన్న, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



నిమ్మనపల్లిలో నివాళులర్పిస్తున్న సంఘ నేతలు

అంబేడ్కర్ ఆశయాలను నెరవేరుద్దాం

మదనపల్లె టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కలలుగన్న ఆశయాలను నెరవేరుద్దామని ఫోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ పేర్కొన్నారు. శనివారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఫోర్డు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. గాంధీపురం సర్కిల్ వద్ద ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సాయిహితేష్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సివిల్ సప్లైస్ గోదాము వద్ద అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. సీపీఐ కృష్ణప్ప, మాధవ్ ప్రసంగించారు. కార్యక్రమంలో జలజ, సుభాషిణి, ఏబీవీపీ నేతలు సాయిప్రకాష్, విష్ణువర్ధన్, నవీన్, గౌతమ్, ఏఐఎస్ఎఫ్ నేతలు సాయికిరణ్, సీపీఐ తిరుమలప్ప, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.



కాలనీగేట్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

కాలనీ గేటులో...

మదనపల్లె అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాలనీ గేటు, గొల్లపల్లెలోని అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించిన ఎమ్మెల్యే షాజహాన్‌బాష మాట్లాడుతూ బహుజనుల అభ్యున్నతి కోసం అంబేడ్కర్ భారత రాజ్యాంగం ద్వారా రిజర్వేషన్ కల్పించి వారి ఉన్నతికి పాడుపడ్డారన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నేతలు చంద్రయ్య, గుండా మనోహర్, మల్లెల మెహన్, లక్ష్మీపతి, మోహన్, సర్పంచ్ శరత్‌రెడ్డి, రమణ భాస్కర్, బాస్ నాయకులు మోహన, తలారి కృష్ణ, గంగలప్ప, క్రాంతి, ఇర్ఫాన్, రెడ్డిప్రసాద్, రెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట జ్యోతిచౌక్‌లో....

బి.కొత్తకోట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జ్యోతిచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి మండల ఎమ్మార్పీఎస్, భారతీయ అంబేడ్కర్ సేన నేతలు నివాళులర్పించారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు దుమ్ము చిన్నా, భవానివెంకటేష్, చౌడప్ప, పలకహరి, సీపీఐ సలీంబాష, బాస్ నాయకులు సొట్టనరసింహులు, సచిన్ తదితరులు పాల్గొన్నారు.



బి.కొత్తకోటలో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

చిరస్మరణీయుడు అంబేడ్కర్

తంబళ్లపల్లె, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు గంగాధర, తంబళ్లపల్లె ఇన్‌చార్జి వేటా మల్లికార్జున అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హరిత కూడలి వద్ద, ఫోర్డు కార్యాలయంలో ఆ సంస్థ సిబ్బంది నరసింహులు, డాక్టర్ మున్నా అంబేడ్కర్ వర్ధంతి చేశారు. ఎమ్మార్పీఎస్ నేతలు వెంకటప్ప, బొజ్జప్ప, మల్లికార్జున, హరిబాబు, ఫక్కీరప్ప, రమణప్ప, గోవిందు, ఫోర్డు సిబ్బంది పాల్గొన్నారు.



తంబళ్లపల్లెలో ఎమ్మార్పీఎస్ నేతలు

ములకలచెరువులో...

ములకలచెరువు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వినాయకనగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. ములకలచెరువులో నిర్వహించిన అంబేడ్కర్ వర్ధంతిలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మంచాల హరికుమార్, నేతలు భాస్కర, అంజి, బాస్ మండల నేతలు నారాయణ, చాట్ల నరసింహులు, మంత్రాల రమణ, రామప్ప, టీచర్ ఆదినారాయణ, డేగిని నరసింహులు, రమణ, వెంకటరమణ నాయుడు, బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దపాళ్యం సోమశేఖర్, మండల అధ్యక్షుడు మహేష్, నేతలు రోహిత్, మహేంద్ర, చెన్నకేశవ తదితరులు వేర్వేరుగా నివాళులర్పించారు.

పెద్దమండ్యంలో...

పెద్దమండ్యం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):మండలంలో అంబేడ్కర్ వర్ధంతి జరిగింది. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల వద్ద వున్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. తహసీల్దార్ తేజస్వి, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఎంఈఓ మనోహర్, రామ కృష్ణ, ఉపాధ్యాయులు సీవీ రమణ, బాబు పాల్గొన్నారు.

పీటీఎంలో ఘనంగా నివాళి

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పీటీఎం సచివాలయంలో శనివారం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకుని పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. స్థానిక సచివాలయంలో సర్పంచ్ తమక శంకర అధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా పంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సురేంద్రబాబు, పంచాయతీ కార్యదర్శి షబానా, మాజీ ఎంపీటీసీ సురేష్‌బాబు, కల్లూరి రమేష్‌బాబు, బిల్ కలెక్టర్ శంకర, కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తోంది : ఎమ్మెల్యే

మదనపల్లె అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అభివృద్ధి కోసం ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాష అన్నారు. శనివారం మదనపల్లె ఆర్టీసీ బస్‌స్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన జిల్లా సాధన ఉద్యమకారుల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు మదనపల్లె జిల్లా ప్రకటనతో ఇక్కడ ప్రజల ఏళ్లతరబడి ఆకాంక్ష నేరవేరినట్లు అయిందన్నారు. ఉద్యమకారులను ఆర్టీసీ వన్‌అండ్‌టూ డిపోల ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి ఆధ్వర్యంలో సన్మానించారు. రెండు డిపోల ఈయూ గౌవరవాధ్యక్షుడు నాగూర్‌వలి మాట్లాడుతూ మదనపల్లె జిల్లా ప్రకటించిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే షాజహాన్‌బాషకు జిల్లా కోసం పోరాడిన జిల్లా సాధన సమితి నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. మదనపల్లె డిపోలో మోడరన్ టాయిలెట్స్, గ్యారేజీలో, ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో సీసీ రోడ్లు ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. భవిష్యత్‌లో బస్‌స్టాండ్ ఆవరణలో అధికారులు కార్యాలయాలు, షాపు రూములు ఏర్పాటు చేసేలా ప్రయత్నం చేస్తామన్నారు. టమోటా మార్కెట్ అధ్యక్షుడు జంగాల శివరాం, బాస్ నేత పీటీఎం శివప్రసాద్, టీడీపీ నేతలు షంషీర్, గిరీషా, పరుపుల జయరామ్, ఎం.నాగయ్య, వేమయ్య దుబ్బిగాళ్ల భాస్కర్, రమేష్, వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సీఏబాబు, నాగరాజ, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి విగ్రహావిష్కరణను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బీజేపీ నేత చల్లపల్లి

బి.కొత్తకోట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల14న భారత మాజీ ప్రధాని దివంగత వాజ్‌పేయి విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేయాలని సీనియర్ నేత చల్లపల్లి నరసింహారెడ్డి పిలుపు నిచ్చారు. బి.కొత్తకోటలో శనివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసమీకరణ, రవాణా తదితర ఏర్పాట్లపై స్థానిక నేతలతో చర్చించారు. కేంద్ర మంత్రులు, పలువురు ముఖ్య నేతలు హాజరయ్యే ఈ సభను దిగ్విజయంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో నేతలు ముకుంద, రమేష్, ప్రశాంత్, రంగారెడ్డి, మంజునాథ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలను పీలేరులో కలపాలి

పీలేరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలోని రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలను పీలేరు రెవెన్యూ డివిజన్‌లోకి కలపాలని పీలేరు రెవెన్యూ డివిజన్ సాధన సమితి కన్వీనర్ ఎస్.సుధాకర్ బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పీలేరులో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం కొత్త జిల్లాలు, కొత్త రెవెన్యూ డివిజన్‌లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలకు అన్యాయం చేయకూడదన్నారు. ఆ రెండు మండలాల ప్రజలు పీలేరుకు చేరుకోవడం చాలా సులువని, చిత్తూరుకు వెళ్లాలంటే 60 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందన్నారు. ఆ రెండు మండలాల ప్రజలు విద్య, ఉపాధి, వివాహాది వ్యవహారాల్లో పీలేరుతో సంబంధాలు కలిగి ఉన్నారని, ఆ మండలాల ప్రజలు కూడా తమను పీలేరులో కలపాలని కోరుతున్నారన్నారు. ప్రభుత్వం వారి ఆకాంక్షలను గౌరవించి పీలేరులో కలపాలని, అలా జరగని పక్షంలో ప్రజలతో కలిసి ఉద్యమిస్తామన్నారు. అంతకుమునుపు ఆయన అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

ఏపీలో ప్రత్యేక కమిషన్‌తో బీసీ కులగణన చేపట్టాలి



సదస్సులో ఐక్యత తెలుపుతున్న బీసీ నేతలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏపీలో ప్రత్యేక కమిషన్‌తో బీసీ కులగణన చేపట్టాలని బీసీ నేతలు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఓ పంక్షన్‌హాల్‌లో బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు ఆధ్వర్యంలో బీసీ సదస్సు నిర్వహించారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. శ్రీచందు మాట్లాడుతూ ఏపీలో బీసీ జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాస్ నేత పీటీఎం శివప్రసాద్, బీసీ నవచైతన్య వేదిక నాగరాజు, బీసీ సంక్షేమ సంఘం మల్లిక, మేదర సంఘం సుబ్బు, మల్లికా, గాండ్ల సంఘం కృష్ణయ్య, బీసీవై పార్టీ పాల రమేష్‌యాదవ్, సీపీఐ సాంబశివ, కృష్ణప్ప, బెస్తసంఘం రమణ, చేనేత సంఘం వీరభాస్కర్, కురవ సంఘం నేతలు, రాయలసీమ విద్యార్థి సంఘం నాయకుడు ఉత్తన్న, బహుజన సేన నేతలు మనోహర్‌రెడ్డి, భానుప్రకాష్, రెడ్డిశేఖర్, వెంకటేష్, నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



విత్తనాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు కట్టా దొరస్వామినాయుడు, పాలగిరి సిద్ధా

ములకలచెరువు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నియోజకవర్గ టీడీపీ యువనేతలు కట్టా దొరస్వామినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శనివారం రబీ రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ స్రవంతి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చెన్నకిష్టా, తోట గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ లేకుంటే వేతనాల్లో కోత



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ తాజ్‌మస్రూర్

మదనపల్లె టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు వేయకుంటే వారి వేతనాలను కట్ చేయనున్నట్లు ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ హెచ్చరించారు. శనివారం డిప్యూటీ ఎంపీడీఓ తిరుపాల్ నాయక్‌తో కలిసి మండలంలోని కొత్తపల్లె-1, కొత్తపల్లె-2 గ్రామ సచివాలయాలను తనిఖీ చేసిన ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో 25 పంచాయతీలకు కొన్నింటిలోనే స్వమిత్వ సర్వే, ఇతర సర్వేలు 75శాతం వరకు చేరాయని, మిగిలిన వాటిలో సర్వేశాతం తక్కువగా వుందన్నారు. 15వ తేదీ లోపు సచివాలయ సిబ్బంది సమష్టిగా పనిచేస్తూ సర్వేను పూర్తి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి షఫుద్దీన్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారులు

వాల్మీకిపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదం పట్ల అప్రమత్తంగా ఉండాలని వాల్మీకిపురం అగ్నిమాపక అధికారి నాగిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అగ్ని ప్రమాదాల పట్ల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్యాస్ సిలిండర్ పేలుడు సంభవిస్తే తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, నివారణ చర్యలను తెలియజేశారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఏదేని ప్రమాదంలో చిక్కుకున్నా అధైర్య పడరాదని తీసుకోవాల్సిన జాగ్రత్తలను డెమో ప్రదర్శన ద్వారా విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఆనంద్, బాబ్జి, రవి, మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల అనర్థాలపై అవగాహన ర్యాలీ



పీలేరులో విద్యార్థినులతో కలిసి ర్యాలీ చేస్తున్న అధికారులు

పీలేరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం పీలేరులో బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన ర్యాలీ జరిగింది. స్థానిక ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ గురుకులం పాఠశాలలోని విద్యార్థినులకు తొలుత అవగాహన సదస్సు నిర్వహించిన అధికారులు, ర్యాలీ నిర్వహించారు. జిల్లా బాల పరిరక్షణ విభాగం అధికారి వెంకట రవికుమార్ మాట్లాడుతూ బాల్య వివాహ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలతో శారీరక, మానసిక అనర్థాలు కలుగుతాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. అనంతరం బాల్య వివాహాలను అరికడతామని ప్రతిజ్ఞ చేయించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

పాముకాటుతో రైతు మృతి

వాల్మీకిపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో రైతు ఎం.రెడ్డెప్ప(57) మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వాల్మీకిపురం పంచాయతీ పరిధి గొల్లపల్లె రైతు ఎం.రెడ్డెప్ప శుక్రవారం రాత్రి పాడి ఆవులకు పశుగ్రాసం నిమిత్తం వ్యవసాయ పొలాల వద్ద ఉండగా చీకట్లో రక్త పింజరి కాటుకు గురయ్యాడు. రైతు కేకలు విన్న కుటుంబీకులు సంఘటనా స్థలానికి చేరుకుని రెడ్డెప్పను ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించే లోపే మృతి చెందాడు.

నిమ్మనపల్లి ఎస్‌ఐగా విష్ణునారాయణ

నిమ్మనపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా విష్ణునారాయణ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన తిప్పేస్వామి సైబర్ క్రైం వింగ్‌కు బదిలీ కాగా రాయచోటి వీఆర్‌లో వున్న విష్ణునారాయణ నిమ్మనపల్లికి బదిలీపై వచ్చారు.

నరసింహస్వామికి విశేష పూజలు



గుర్రంకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను అలంకరించి అర్చకులు పూజలను చేశారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులు కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

మంచు కౌగిలిలో వీరభద్రాద్రి

తుఫాను ముసురు - మబ్బుల్లో దాగిన సూరీడు


● చలి పులితో జనం బెంబేలు

● పగలు కూడా దీపాల వెలుగులో....



పొగమంచుతో కమ్ముకుపోయిన వీరభద్రాద్రి కొండ

వాల్మీకిపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీరభద్రాద్రి సైతం మంచు కౌగిలిలో బందీ అయింది. తెల్లారి ఆరు గంటలకు కూడా పట్టణం వీధి దీపాల వెలుగులో మినుకుమినుకు మంటూ కన్పిస్తోంది. ఉదయం ఆరు గంటల పది నిముషాల కంతా విధుల్లోకి రావాల్సిన సూరీడు ఎనిమిదిన్నర దాటినా మబ్బుల చాటున దాగి దోబూచులాడాడు. సుమారు పది రోజులుగా ముసురు వర్షాలతో ఇబ్బంది పడుతూ చలికి గజగజా వణికిపోతున్న ప్రజలు గురువారానికి కాసంత తెరపిచ్చే సరికి శుక్రవారం సూరీడి దర్శనం కలుగుతుందనుకున్న ప్రజలు ఆశలు మంచుతో నిండుకుంది. రాత్రిళ్లు విపరీతమైన చలిగాలులు ఇబ్బంది పెట్టాయి. శుక్రవారం ఉదయం 7గంటలు కావస్తున్నా పట్టణ వ్యాప్తంగా వీధుల వెంబడి విద్యుత్ దీపాల వెలుగులు తప్పలేదు. సూరీడు వస్తున్నాడనుకుంతలోపే విపరీతమైన మబ్బులు కమ్మేసి చీకటి వాతావరణాన్ని సృష్టించింది. పట్టణ పరిసర ప్రాంతాల్లోని వీరభద్రాద్రి కొండ, నూరుకుప్పలకొండ, తదితర ప్రాంతాలు మబ్బులతో కమ్ముకుపోయింది. వాతావరణం మొత్తం హిమాలయాలను తలపిస్తూ ఉష్ణోగ్రత్తలు కనిష్టస్థాయికి చేరుకోవడంతో నివాసాల నుంచి బయటకు రావాలన్నా ప్రజలు ఇబ్బం ది పడ్డారు. ఇదిలా ఉండగా మండల వ్యాప్తంగా తుఫాను దాటికి ముసురు వర్షాల దెబ్బకు పూల తోటలు, టమోటా పంటలు సైతం దెబ్బతిన్నాయి.



ఉదయం 6గంటలు దాటినా వీధి దీపాల వెలుగులో



ఉదయం 8గంటలకూ మబ్బుల చాటున సూర్యుడు